# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :257 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 19-12-2024 | పేజీలు:4 వెల: 2.00


## రాష్ట్రంలో దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు..

రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలై.. ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం గజగజ వణికిపోతున్నారు. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.అత్యల్పంగా హైదరాబాద్‌లో 6.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పటాన్‌చెరులో 7డిగ్రీలు, మెదక్‌లో 7.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 11.9 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శీతలగాలుల నేపథ్యంలో ఇప్పటికే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. రానున్న రెండు రోజుల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.

## అసెంబ్లీలో భూభారతి -2024 బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ : తెలంగాణలో సామాన్యుల భూహక్కుల పరిరక్షణే ధ్యేయంగా 2024 ఆర్వోఆర్ -భూభారతి చట్టాన్ని రూపొందించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. బుధవారం శాసనసభలో మంత్రి భూభారతి బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటువంటి అద్భుతచట్టాన్ని ప్రవేశపెట్టే అవకాశం తనకు లభించడం మరచిపోలేని విషయమని అన్నారు. 1971లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు ఉపయోగపడిందని, ముఖ్యంగా రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏడేళ్ల పాటు కూడా ప్రజోపయోగంగా ఉపయుక్తమయ్యిందని తెలిపారు. తర్వాత అర్ధరాత్రి నాలుగు గోడల నడుమ రూపొందిన ధరణి చట్టం వలన సమస్యలు పరిష్కారం కాకపోగా లక్షలాది సమస్యలను తెచ్చిపెట్టిందని చెప్పారు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్నట్లు ధరణి పోర్టల్‌తో లెక్కలేనన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, నాటి ప్రతిపక్షనేత , నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , నేటి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పాదయాత్రల సందర్భంగా ధరణిని అరేబియా సముద్రంలో కలుపుతామని ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆమేరకు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని, ఒక్క గుంట భూమి ఉన్న వారు కూడా తమను నమ్మారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకుగాను ఆర్వోఆర్ 2020ను పూర్తిగా ప్రక్షాళన చేసి భూభారతిని రూపొందించామని చెప్పారు. తాము ఆగస్టు 2న ముసాయిదాను ప్రవేశపెట్టడమేగాక ప్రత్యేకంగా 40 రోజుల పాటు వెబ్ సైట్‌లో పెట్టి ప్రజాప్రతినిధులు,కవులు , మేధావులు, విశ్రాంత అధికారుల సలహాలు సూచనలు స్వీకరించి కొత్త చట్టానికి రూపకల్పన చేశామని తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు 7 పేజీలు, వినోద్‌రావు 5 పేజీల సలహాలు . సూచనలు చేశారని వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. 33 జిల్లాలలో ఒక్కోరోజు ప్రత్యేక చర్చావేదికలు నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. 18 రాష్ట్రాలలోని ఆర్వోఆర్‌లను అధ్యయనం చేసి , ఉత్తమ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని భూభారతిలో పొందుపరిచామని మంత్రి తెలిపారుధరణి కారణంగా ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కేసముద్రం మండలం నారాయణపురంలో కె. రవి అనే ఎంపీటీసీ సభ్యులు భూ సమస్యలను బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలందరి దృష్టికి తీసుకువెళ్లారని , ఏళ్ల తరబడి పరిష్కారం కాలేదని చెప్పారు. అంతేగాక సర్వేనెంబర్లు 149,150, 154,156, 168 తదతరాల్లోని 1398 ఎకరాల భూమి తరతరాలుగా అక్కడి గిరిజనుల సాగుబడిలో ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ధరణి -2020 ఆర్వోఆర్ చట్టం వచ్చాక వారి హక్కులకు భంగం వాటిల్లేలా సదరు భూములు అటవీ భూములని తేల్చిచెప్పారని దీంతో గిరిజనులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని మంత్రి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో 4 నెలల పాటు రిజిస్ట్రేషన్‌లు ఆపివేశారని, దీంతో భూములు అమ్ముకొని కుటుంబంలో పెళ్లిళ్లు, చదువుల కోసం ఖర్చుచేద్దామనుకొనే సామాన్య రైతులకు తీవ్ర అసౌకర్యం కలిగిందని మంత్రి వివరించారు. భూభారతి బిల్లుకు సంబంధించి 22-23 సార్లు అభిప్రాయాలు తీసుకున్నామని, అందువల్లే బిల్లు ప్రవేశపెట్టడంలో .జాప్యం జరిగిందని చెప్పారు. ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా బిల్లు తయారుచేసేందుకు కృషి చేశామని, సాదాసీదా బిల్లును ప్రజలపై రుద్దే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. భూమి చుట్టూ మనిషి జీవితం ముడిపడి ఉంటుంది. తరతరాలుగా మనిషి జీవితానికి, భూమికి విడదీయరాని అనుబంధం ఉంది. భూమి పేదరికాన్ని దూరం చేస్తుంది. ఆత్మగౌరవంతో బతికే అవకాశాన్ని ఇస్తుంది. కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇస్తుంది. గ్రామాల్లో భూమే ప్రధాన జీవనాధారం. భూమిని నమ్ముకుని బతికే కష్టజీవులను కంటికి రెప్పలా చూసుకునే బాధ్యత ప్రభుత్వాలది. కానీ గత ప్రభుత్వం దీన్ని విస్మరించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1971లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్టం 49 ఏండ్లు విజయవంతంగా అమలైంది. ప్రజల అవసరాలే లక్ష్యంగా అసైన్డ్ లాండ్స్ మొదలు అనేక విధాన నిర్ణయాలను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. కాంగ్రెస్ అంటేనే ప్రజలకు ఒక భద్రత, భరోసా. అందుకే ఇప్పటికీ ఇందిరమ్మను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటున్నారు. కానీ వేలాది పుస్తకాలు చదివిన మేధావి 2020 ఆర్వోఆర్ చట్టం ద్వారా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో మూడేండ్లలోనే లక్షలాది కొత్త సమస్యలు తలెత్తాయి. ఉన్న నాలికకు మందేస్తే కొండ నాలుక ఊడినట్లు ధరణి పరిస్థితి తయారైంది. రెవెన్యూ అధికారుల స్థాయిలో పరిష్కారం కావాల్సినవి కోర్టుల దాకా వెళ్ళాల్సి వచ్చింది. నాలుగు గోడల మధ్య కూర్చుని వారికి అనుకూలంగా ఉండేలా ధరణిని అప్పటి పాలకులు బలవంతంగా మన నెత్తిమీద రుద్దారు. ధరణి మానవ సంబంధాలను సైతం దెబ్బతీసింది. లిలిమనుషుల మధ్య దూరాన్ని పెంచింది. భూ యజమానికి తెలియకుండానే చేతులు దాటిపోయేలా చేసింది. కాళ్ళకింద నేల కదిలిపోయినా పేదలు వారి ఆవేదనను చెప్పుకోడానికీ మార్గం లేకుండా చేసింది. అందుకే మా నాయకుడు రాహుల్‌గాంధీ ఎన్నికల సమయంలో ధరణిని అరేబియా మహా సముద్రంలో వేస్తామని హామీ ఇచ్చారు. మా హామీని తెలంగాణ ప్రజలు విశ్వసించి అధికారాన్ని అప్పగించారు. దానికి అనుగుణంగా మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మా సహచర ప్రజా ప్రతినిధుల సమక్షంలో ధరణిని బంగాళాఖాతంలో కలిపి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం. ఇప్పుడు భూ-భారతిని తీసుకొస్తున్నాం. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మా సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు ధరణి కష్టాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి భూ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేశాం. అనేకసార్లు వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి రెవెన్యూ చట్టాలను ఈ కమిటీ అధ్యయనం చేసింది. ఆనాటి దొరలు గడీల్లో కూర్చుని తయారు చేసిన 2020 చట్టాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రజలు కోరుకున్న విధంగా తెలంగాణ భూభారతి డ్రాఫ్ట్ బిల్లును ఇదే అసెంబ్లీలో ఆగస్టు 2న ప్రవేశపెట్టాం. ప్రజల నుంచి చట్టం రావాలనే ఉద్దేశంతో అదే రోజున సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో కూడా ముసాయిదా బిల్లును అందుబాటులో ఉంచాం. దాదాపు పాతిక రోజుల పాటు ప్రజా ప్రతినిధులు, రైతుసంఘాల ప్రతినిధులు, మేధావులు, సామాన్య ప్రజానీకం, రిటైర్డ్ అధికారుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించాం.

## అంబేద్కర్ వివాదంపై స్పందించిన ప్రధాని మోదీ.. రాహుల్, ఖర్గేలతో భేటీ



న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి అమిత్ షా.. తన ప్రసంగంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానించినట్లు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలకు ప్రధానమంత్రి మోదీ(పీఎం మోదీ) రియాక్ట్ అయ్యారు. ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో ఇవాళ స్పందించారు. అంబేద్కర్‌తో లింకున్న అయిదు ప్రాంతాలను తమ ప్రభుత్వం డెవలప్ చేస్తోందన్నారు. చైత్య భూమి అభివృద్ధి అంశం కొన్ని దశాబ్ధాలుగా పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. అయితే ఆ పరీక్ష తమ ప్రభుత్వం పరిష్కరించింది. అక్కడికి వెళ్లి ప్రార్ధన చేసినట్లు మోదీ చెప్పారు. ఢిల్లీలోని అలీపూర్ రోడ్డులో అంబేద్కర్ తన చివరి రోజుల్ని గడిపారని, ఆ ప్రాంతాన్ని కూడా డెవలప్ చేస్తున్నట్లు వెల్లడించారు. లండన్‌లో ఆయన నివసించిన ఇంటిని కూడా స్వాధీనం చేసుకుని డెవలప్ చేస్తున్నట్లు చెప్పారు. అంబేద్కర్‌కు ఇచ్చే గౌరవం, మర్యాదలో లోటు లేదన్నారు. అంబేద్కర్ వల్లే తాము ఇక్కడ ఉన్నట్లు మోదీ చెప్పారు. అంబేద్కర్ విజన్‌ను పూర్తి చేసేందుకు గత దశాబ్ధ కాలం నుంచి తమ నిర్విరామంగా కృషి చేస్తున్నామన్నారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి తొలగించామన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేశామన్నారు. స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, ఉజ్వల్ యోజన లాంటి తమ పథకాలన్నీ పేద, అణగారిన ప్రజల జీవితాలను మార్చినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాలు చేస్తోందని, ఆ పార్టీ అబద్దాలతో అంబేద్కర్‌ను అవమనిస్తోందని, వాళ్లు చేసిన తప్పుల్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. దశాబ్ధాలుగా ఓ పార్టీ, ఓ కుటుంబం.. అన్ని రకాలుగా అంబేద్కర్ వారసత్వాన్ని, ఎస్సీ, ఎస్టీ వర్గాలను నిర్వీర్యం చేసిందని ప్రధాని తన ట్వీట్‌లో విమర్శించారు. అంబేద్కర్ అంశంలో తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు.. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గేలను ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రి అమిత్ షా కూడా కలిశారు. అంబేద్కర్ పేరును పదేపదే ప్రతిపక్షాలు లేవనెత్తుతున్నాయని, ఆ పార్టీలకు అదో ఫ్యాషన్ అయినట్లు అమిత్ షా తన రాజ్య సభ ప్రసంగంలో మంగళవారం పేర్కొన్నారు. అంబేద్కర్ పేరుకు బదులు దేవుడిని ప్రార్థిస్తే, వాళ్లు స్వర్గానికి వెళ్లేవారు అని షా చెప్పారు. దీన్ని విపక్షాలు తప్పుపట్టాయి. షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాయి.

## మోడీ ప్రభుత్వం ప్రాంతీయ భాషల ప్రోత్సాహానికి కృతనిశ్చయంగా పనిచేస్తోంది..




హైదరాబాద్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తాజాగా మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇందులో భాగంగా.. మోడీ ప్రభుత్వం ప్రాంతీయ భాషలను ప్రోత్స హించేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తోందని, భారత్ భిన్న సంస్కృతులు, భిన్న భాషల వైవిధ్యంతో గొప్పదని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇంత వైవిధ్యత ఉన్న దేశం మరొకటి లేదని, మన దేశంలో 121 భాషలు ఉన్నాయని తెలిపారు. ఇతర దేశాలతో పోలిస్తే, భారతదేశం భాషలలో గొప్ప వైవిధ్యాన్ని కలిగి ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మన రాజ్యాంగంలో 14 అధికార భాషలు ఉండేవి. కానీ, మోదీ ప్రభుత్వం వచ్చాక 21 భాషలకు అధికారిక స్థానం దక్కిందని కిషన్ రెడ్డి చెప్పారు. భాషలు మన సంస్కృతి, వారసత్వం, జ్ఞాన సంపదకు నిలయాలు అని కిషన్ రెడ్డి చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం, వాజ్ పేయి నేతృత్వంలో ప్రాంతీయ భాషలకు సరైన ప్రాధాన్యత ఇచ్చిందని, భాష మన సంస్కృతికి ఆత్మ వంటిదని వాజ్ పేయి చెప్పారని ఆయన పేర్కొన్నారు. భారత శాస్త్రీయ భాషల ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం 1835లో మెకాలే ద్వారా జరిగిందని కిషన్ రెడ్డి తెలిపారు. 1956లో భాషా ఆధారిత రాష్ట్రాల పునర్నిర్మాణం జరిగినపుడు, భాష ఒక కీలక అంశంగా మారిందని కిషన్ రెడ్డి తెలిపారు. పాలనాపరమైన సౌలభ్యం కోసం మూడు భాషల ఫార్ములాను రూపొందించారు. అయితే, ప్రజలు ఈ ఫార్ములా వినియోగంలో సంతృప్తిగా లేని కారణంగా, మార్పులు తీసుకురా వాలనే డిమాండ్ పెరిగిందని ఆయన వివరించారు. 2020లో మోదీ NEP-2020 నూతన జాతీయ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం ద్వారా విద్యార్థులు కనీసం రెండు ప్రాంతీయ భాషలను నేర్చుకునేలా ప్రోత్సాహం ఇచ్చారని కిషన్ రెడ్డి చెప్పారు. భాషల ప్రాముఖ్యతను తీసుకుని, మోదీ ప్రభుత్వం దేశంలో ప్రాంతీయ భాషలను మరింత ప్రోత్సహించడానికి కృషి చేస్తోందని ఆయన అన్నారు.

## అసెంబ్లీ బయట డ్రంకెన్ డ్రైవ్‌లు పెట్టాలి..

హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు.



అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్‌లు పెట్టాలని హరీష్ రావు సూచించారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేక్ వ్యాఖ్యలపై సభలో దుమారం

హైదరాబాద్,తెలంగాణ అసెంబ్లీ చర్చలో ఇటీవల జరిగిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేక్ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేచింది. విపక్షపార్టీ ఎమ్మెల్యే వివేక్ చేసిన వ్యాఖ్యలపై రవాణా, పౌరసరఫరాల మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ.."వివేక్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాలి" అని తెలిపారు. వివేక్ ఫస్ట్ టైం ఎమ్మెల్యే కాదని, ఆయన 2014లోనే అసెంబ్లీకి వచ్చి ఇంకా అవగాహన లేకుండా, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. వివేక్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆయన సూచించారు. ఇకపోతే, 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్ ఫ్రేమ్ చేసి, అసెంబ్లీలోకి ఇతర దుస్తులు వేసుకురావద్దని నియమాలు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. నిన్న నల్ల దుస్తులు వేసుకొస్తే, అయ్యప్ప భక్తి అనుకున్నాంకానీ, ఈ రోజు ఆటో డ్రైవర్ దుస్తులు వేసుకొచ్చారని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ విషయాన్నీ తప్పుబడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో విధంగా వ్యవహరిస్తున్నారంటే అది బీఆర్ఎస్ వ్యవహారం అని మండిపడ్డారు. ఈ క్రమంలో, బీఆర్ఎస్ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని ఆయన విమర్శించారు. అయితే, వివేక్ చేసిన వ్యాఖ్యలను 320 రూల్ ప్రకారం తొలగించినట్లు స్పీకర్ ప్రకటించారు. కానీ, వివేక్ తన వ్యాఖ్యలను మరొకసారి పునరుద్ఘాటిస్తూ, 10 శాతం లంచం తీసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై స్పీకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## కేంద్రంపై రాహుల్ గాంధీ ఆగ్రహం..



న్యూఢిల్లీ, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ సర్కార్ పారదర్శకంగా వ్యవహరించకుండా, చట్ట ప్రకారం జరిగే వ్యాపారాలను పట్టించుకోకపోవడంతో.. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. ప్రధాని మోడీ అవలంభించే ఇలాంటి చర్యలతో దేశంలో తయారీ రంగం రోజురోజుకు మరింత బలహీనపడుతోంది, కరెన్సీ విలువ క్రమంగా పడిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, రికార్డు స్థాయిలో గరిష్ఠ వాణిజ్య లోటు, అధిక వడ్డీ రేట్లు పెరిగాయని పేర్కొన్నారు. వస్తువుల వినియోగం తగ్గి ద్రవ్యోల్బణం పెరుగుదల వంటివి చూస్తున్నామని రాహుల్ గాంధీ మండిపడ్డారు. అయితే, దేశంలో వాణిజ్య లోటు, దిగుమతులు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోతున్నాయని వస్తున్న వార్తా కథనాలను గుర్తు చేస్తూ.. కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వాలు క్రోనీ క్యాపిటలిజం విధానాలకు ప్రాధాన్యమిస్తే ఎలా అని ప్రశ్నించారు. గత నవంబరులో దేశీయ వాణిజ్య ఎగుమతులు ఏడాది క్రితం ఇదే నెలతో పోలిస్తే 4.85 శాతం తగ్గి 32.11 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాని చెప్పుకొచ్చారు. అలాగే, దిగుమతులు 27 శాతం పెరిగి రికార్డు స్థాయి 69.95 బిలియన్ డాలర్లకు చేరుకుందని పేర్కొన్నారు. దీంతో వాణిజ్య లోటు 37.84 బిలియన్ డాలర్లకు చేరుకుందన్నారు. ఇది జీవనకాల గరిష్ఠ స్థాయి అని రాహుల్ గాంధీ వెల్లడించారు.

## జల్‌జీవన్ మిషన్‌లో 4వేల కోట్లు దుర్వినియోగం చేసింది



అమరావతి,జల్‌జీవన్ మిషన్‌ను మరింత బలోపేతం చేస్తామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడలో జల్‌జీవన్ మిషన్ పథకం అమలుపై రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ జరిగింది. ఈ వర్క్ షాప్ ను పవన్ కల్యాణ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజుకు మనిషికి సగటున 55 లీటర్లు పరిశుభ్రమైన నీటిని ఇవ్వాలనేది ప్రధాని నరేంద్ర మోదీ కల అని, నిరంతరం ప్రతిఒక్కరికీ నీటి సరఫరా ఉండాలనే ఆకాంక్షతో ఈ జల్‌జీవన్ మిషన్ ప్రారంభమైందని అన్నారు. ఉన్న నీటి వనరులు బలోపేతం చేయడం, నిర్వహణ ముఖ్యం. ఉద్యోగులే కాకుండా ప్రజలను కూడా భాగస్వాములు చేయాలనేది ఆలోచన. నీటి సరఫరాలో తరచూ వచ్చే ఇబ్బందుల పరిష్కారానికి అమృతధార కింద విధివిధానాలు రూకల్పన చేస్తామని పవన్ అన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జల్‌జీవన్ మిషన్‌ను బలోపేతం చేస్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. 2019లో ప్రారంభం అయినా గత ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేదని, గత ప్రభుత్వం ఈ పథకానికి 26వేల కోట్లు మాత్రమే అడిగారని, 4వేల కోట్లు మాత్రమే కేంద్రం నుండి తీసుకురాగలిగారని అన్నారు. ఈ పథకంలో రిజర్వాయర్స్ నుండే నీటిని తీసుకోవాలి. కానీ, గత ప్రభుత్వం గ్రౌండ్ లెవల్ నుండి తీశారు. అవసరం లేకపోయినా పైపు లైన్లు, బోర్ వెల్స్ వేశారని పవన్ విమర్శించారు. వచ్చిన కొద్దిపాటి నిధులనుసైతం సక్రమంగా వినియోగించలేదని, 4వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయని పవన్ అన్నారు. 4వేల కోట్లు ఏం చేశారు..? ఎవరికి నీరు ఇచ్చారు? ఎక్కడికి వెళ్లినా నీటి కొరత కనిపిస్తూనే ఉందని గత ప్రభుత్వంలో పథకం అమలు తీరుపై పవన్ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రిజర్వాయర్ నుండే నీటిని తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, ఈ పథకానికి 70వేలకోట్లు నిధులు కావాలని నేను కేంద్రాన్ని కోరడం జరిగిందని పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ మేరకు కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ను కోరామన్నారు. పూర్తి వివరాలతో రావాలని ఆయన సూచించినట్లు వివరించారు. జనవరి నెలాఖరుకు డీపీఆర్ తీసుకొని జల్ శక్తి మంత్రికి ప్రతిపాదన పంపిస్తామని పవన్ పేర్కొన్నారు.

### జమ్ముకశ్మీర్ కథువాలో భారీ అగ్నిప్రమాదం.. ఆరుగురు మృతి

జమ్మూ కాశ్మీర్ : జమ్ముకశ్మీర్‌లోని కథువాలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శివనగర్‌లోని ఓ ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇల్లంతా దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ఊపిరాడక ఆరుగురు మరణించారు. మరో ముగ్గురు అపస్మారకస్థితిలోకి వెళ్లారు.

## సంపాదకీయం

గురువారం 19-12-2024

# రక్షణ కవచం నిర్లక్ష్యం ఫలితం

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇటీవల కాలంలో పెరుగుతున్న ఘటనలు ..మన ముందున్న లెక్కలు ఈ విషయం చెబుతున్నాయి. ముఖ్యంగా టూవీలర్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాహన ప్రమాదాలలో చనిపోతున్న వారు కూడా ద్విచక్ర వాహనదారులే అధికం. దీనికి వారి నిర్లక్ష్యం కూడా కారణమవుతోంది. బైక్ నడపడంలో తాము నేర్పరులమని, హెల్మెట్ అవసరం లేదని, ఇది శిరోభారమని భావించేవారు మనలో చాలా మందే ఉన్నారు. హెల్మెట్ భారం కాదు అది ఒక రక్షణ కవచం. యువత బైక్ ఎక్కితే చాలు రయ్ రయ్ మని దూసుకుపోతుంటారు. మితిమీరిన వేగం, మద్యం మత్తులో నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం పరిపాటిగా మారింది. ఇటీవల యువత సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, ఓవర్‌టేక్ చేయడం, నిర్లక్ష్యంగా హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలు తీసుకుంటున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న సంఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. శరీరానికి తలకాయ ప్రధానం, ఇంద్రియాలలో నైనం ప్రధానం, షడ్రుచులలో ఉప్పు ప్రధానం, నదులకు నీరు ప్రధానం' అని సుభాషిత రత్నావళి చెబుతుంది. కానీ, శిరస్సుకు శిరస్త్రాణం ప్రధానం అని జీవితం చెబుతుంది. ఉరుకుల పరుగుల జీవితంలో వేగానికున్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. హెల్మెట్ లేకపోతే ఏమౌతుందిలే అన్న చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ఎంతోమంది యువకులు ప్రాణాలను కోల్పోతున్నారు. దేశంలో ఏడాదికి సగటున 1.78లక్షల మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారని, అందులో 60మంది 18నుంచి 34 ఏళ్లలోపు వారేనని సాక్షాత్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల లోక్‌సభలో వెల్లడించారు. దేశంలో ప్రతి గంటకూ దాదాపు 53 ప్రమాదాలు, 19 మరణాలు జరుగుతున్నాయి. దీనిలో 45శాతం ద్విచక్ర వాహన ప్రమాదాలే. దేశంలో ప్రస్తుతం యువ జనాభా ఎక్కువగా వుంది. అయితే, ప్రస్తుతం 15 ఏళ్ల లోపు వున్న బాలల శాతం 2036 నాటికి గణనీయంగా తగ్గనుందని 'భారతదేశంలో మహిళలు-పురుషులు 2023' నివేదిక వెల్లడిస్తోంది. దీనికంటే ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే ద్విచక్ర వాహన ప్రమాదాలలో చనిపోతున్న వారిలో ఎక్కువమంది యువతే కావడం. తెలుగు రాష్ట్రాల్లోలో హెల్మెట్ ధరించకుండా బైక్‌లు నడుపేవారి సంఖ్య అధికంగా ఉంది. హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని ఏ.పి హైకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. తాజాగా 'హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నా యని, గత జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఏపీలో 667 మంది చనిపోయారని' తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హెల్మెట్ వినియోగించేలా చేయడంలో పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే అంతమంది చనిపోయారని, పోలీసుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి నెలకొందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఒక పరిమితి వరకే బండి వేగం మన చేతుల్లో వుంటుంది. ఆ పరిమితి దాటితే ఆ వేగాన్ని కంట్రోల్ చేయడం కష్టం. వేగాన్ని నియంత్రించుకోలేకపోతే అది ప్రమాదానికి దారితీస్తుంది. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ పెట్టుకోవాలని 'మోటారు వాహనాల చట్టం 1998'లోని 129, 177 సెక్షన్లు చెబుతున్నాయి. దీని ప్రకారం జరిమానా విధించడమే కాదు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం కూడా వుంటుంది. మనం ప్రయాణించే రోడ్డు రేస్ ట్రాక్ కాదు. వాహనం ఎక్కగానే రేసింగ్ మూడ్‌లోకి వెళ్లిపోవడం వల్ల కోరి ప్రమాదాన్ని తెచ్చుకోవడమే అవుతుంది. టైర్లు, బ్రేకులు, బైక్ కండిషన్ పట్ల శ్రద్ధ పెట్టాలి. చాలావరకు రోడ్డు ప్రమాదాలు, టైర్లు, బ్రేకులు విఫలమవడం వల్లనే జరుగుతాయి. హెల్మెట్ ధరిస్తే? ప్రాణాలు కోల్పోకుండా కనీసం గాయాలతోనైనా బయటపడే అవకాశం వుంటుంది. హెల్మెట్లు ప్రమాదాలలో మరణాన్ని నివారించగలవు, నిరోధించగలవు. అయితే, అది మాత్రమే చాలదు. బైక్ నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మీకే కాదు, తోటి ప్రయాణికులకు కూడా ప్రమాదమే నన్న విషయం గుర్తించాలి.

# ప్రపంచం మీద డాలర్ పెత్తనం



అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థ ద్వారా అన్ని దేశాలకూ సౌకర్యంగా ఉండే ఒక చెల్లింపుల విధానాన్ని రూపొందించుకుని ఆ ప్రాతిపదికన వాణిజ్యాన్ని కొనసాగించవచ్చని కొంత మంది ఆర్థికవేత్తలు భావిస్తారు. కాని వాస్తవం అందుకు పూర్తి భిన్నం. పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల పెత్తనం మీద ఆధారపడి అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పడింది. ఈ ఆర్థిక, ద్రవ్యవ్యవస్థ తిరిగి అదే సామ్రాజ్యవాదానికి అండగా నిలబడుతుంది. ఈ అంతర్జాతీయ వ్యవస్థకు ఇరుసు అమెరికన్ డాలర్. ఐతే, అంతర్జాతీయ వాణిజ్యంలో పాల్గొనే వివిధ దేశాల మధ్య పరస్పరం జరిగే వాణిజ్యానికి ఈ డాలర్ పెత్తనం ప్రతిబంధకంగా ఉ ంటోంది. ఉదాహరణకు, 1వ దేశానికి 'క' అనే సరుకు అవసరం అనుకోండి. అది 2వ దేశం తయారు చేస్తోంది. ఈ 2వ దేశానికి 'చ' అనే సరుకు అవసరం అను కోండి. దాన్ని 1వ దేశం తయారు చేస్తోంది. అప్పుడు ఈ రెండుదేశాలూ ఆ రెండు సరుకులనూ పరస్పరం మార్పిడి చేసుకోవచ్చు కదా. కాని ప్రస్తుత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ ప్రకారం అలా మార్పిడి చేసుకోడానికి వీల్లేదు. ఆ రెండు దేశాల వద్దా తమకు కావలసిన సరుకులను కొనుగోలు చేయడానికి సరిపడా డాలర్ నిల్వలు ఉండాలి. అలా లేకపోతే ఆ రెండు దేశాలూ తమ సరుకులను మార్పిడి చేసుకోలేవు. అంతర్జాతీయ వ్యాపారం యావత్తూ డాలర్ కరెన్సీతోనే సాగుతుంది. ఈ నిబంధన గనుక లేకపోతే చాలా దేశాలు తమ తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చు కోవచ్చు. డాలర్ మీద ఆధారపడడం అనేది తగ్గితే అది అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేస్తుంది. విధంగా డాలర్ మీద ఆధారపడటం తగ్గితే అది అమెరికాకు అంగీకారంగా ఉండదు. ప్రపంచమంతా డాలర్‌ను మారకపు సాధనంగా అంగీకరించడం, డాలర్ రూపంలో నిల్వఉంటే అది బంగారపు నిల్వతో సమానం అన్న అభిప్రాయం ప్రబలంగా ఉండడం అనేది అమెరికాకు చాలా పైచేయిని కల్పిస్తుంది. అమెరికా ఇప్పుడు ఎన్నటికీ తరగని ఒక బంగారపు గని మీద దర్జాగా కూర్చుని వుంది. ఇతర దేశాలనుండి తనకు కావలసిన వనరులను అది కొనుగోలు చేయవచ్చు, సంస్థలనే కొనుగోలు చేయవచ్చు, విదేశాలలో ఎంత కావాలంటే అంత పెట్టుబడి పెట్టవచ్చు. తన విదేశీ వ్యాపారంలో లోటుగనుక ఏర్పడితే దానిని పూడ్చుకోడానికి ఎన్ని డాలర్లు కావాలంటే అన్నింటిని ముద్రించుకోవచ్చు. అలా అపరిమితమైన కొనుగోలు శక్తిని అంతర్జాతీయ వాణిజ్య రంగంలో కలిగివుండడమే కాదు. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి వుండేలా చేయడానికి కూడా డాలర్ పెత్తనం తోడ్పడుతుంది. ఆ యా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లోనే భద్రపరచడం జరుగుతుంది. అందుచేత అమెరికా తనకు నచ్చిన దేశానికి కావలసినంత మేరకు డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు. తనకు నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేసి డాలర్ల కొరతనూ సృష్టించవచ్చు. ఇరాన్ నుండి రష్యా వరకూ అనేక దేశాలు ఈ విధంగా శిక్షలు అనుభవిస్తున్నాయి. ఈ విధంగా వివిధ దేశాల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం ఈ మధ్య కాలంలో మరీ ఎక్కువైంది. దాంతో డాలర్ ప్రమేయంలేని వ్యాపారం కావాలన్న డిమాండ్ ఆ డాలర్ల కొరతను ఎదుర్కొంటున్న దేశాల నుండి పెరుగుతోంది.ప్రస్తుతం దాదాపు మూడోవంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి శిక్షలను ఎదుర్కొం టున్నాయి. అయితే ఆ విధంగా శిక్షించడానికి ఐరాస నుండి అమెరికాకు ఎటువంటి అనుమతీ లేదు. దక్షిణాఫ్రికా దేశం జాతి వివక్షతను పాటించిన కాలంలో అంతర్జాతీయ సమాజం ఆదేశాన్ని శిక్షించడానికి ఆమోదం ఇచ్చింది. అటువంటి సందర్భాలేవీ లేకపోయినా అమెరికా తన పెత్తనాన్ని చెలాయిస్తూ తనకు లొంగని దేశాల ఖాతాలను స్తంభింపజేస్తూ వాటిని ఇబ్బందులపాలు చేస్తోంది. వాటిలో మూడవ ప్రపంచ దేశాలు ఎక్కువగా ఉన్నాయి. అమెరికా కన్నెర్రకు గురైన దేశాలు ఇప్పుడు డాలర్ ప్రమేయం లేని అంతర్జాతీయ వాణిజ్యం కావాలని కోరుకుంటున్నాయి. ఇటీవల కజన్‌లో జరిగిన 'బ్రిక్స్' దేశాల శిఖరాగ్ర సమావేశంలో ఈ ఆకాంక్ష బలంగా వ్యక్తమైంది.మ పెత్తనం వల్లే ఇటువంటి ఆకాంక్షలు తలెత్తుతున్నాయని అమెరికన్ ప్రభుత్వం సైతం గుర్తించింది. అమెరికన్ ఆర్థిక శాఖ మంత్రి జేనెట్ యె÷-లలెన్ జులైలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ 'అమెరికా ఆంక్షలు ఎన్ని ఎక్కువ దేశాల మీద విధిస్తే అన్ని ఎక్కువ దేశాలు అమెరికన్ డాలర్ ప్రమేయం లేని వ్యాపారం కావాలని కోరుకుం టాయి.' అన్నారు. తన అడుగులకు మడుగులొత్తేలా ఒత్తిడి చేయడానికి అమెరికా ఆంక్షల బెదిరింపును వాడుకుంటోందని యె÷-లలెన్ చెప్పకనే చెప్పారు. అలా బెదిరింపులలకు బలౌతున్న దేశాల సంఖ్య పెరుగుతున్న సంగతినీ అంగీకరించారు. అలా ఏకపక్షంగా ఆంక్షలు విధించడం ద్వారా పెత్తనాన్ని చెలాయిం చేందుకు పూనుకోవడం వలన పరస్పర విరుద్ధ ఫలితాలు వస్తాయి. ఒకటో, రెండో దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు వాటి ప్రభావమూ గట్టిగా ఉంటుంది, ఆ ఆంక్షలు మొత్తం వ్యవస్థకూ ముప్పు తెచ్చిపెట్టవు. అదే అనేక దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు మొత్తం వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుంది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా పేదరికంలోకి దిగజారిపో తున్న దేశాల సంఖ్య పెరుగుతోంది. అందుచేత ఎదురు తిరిగే దేశాల సంఖ్య రానున్న కాలంలో ఇంకా పెరిగే అవకాశా లున్నాయి. వాటి మీద ఆంక్షలూ పెరుగుతాయి. అప్పుడు ఈ డాలర్ పెత్తనమే వద్దనే దేశాల సంఖ్యా పెరుగుతుంది.

డాలర్‌ను అంతర్జాతీయ మారకపు సాధనంగా ఉపయోగించడం వలన అమెరికా దానిని అడ్డం పెట్టుకుని వివిధ దేశాల మెడలు వంచి వాటిపై తన పెత్తనాన్ని చెలాయించడం వల్లనే ఇలా జరుగుతోంది. అందుచేత డాలర్ మారకపు కరెన్సీగా ఉండడం అనేది అంతర్జాతీయ వాణిజ్యంలో అన్ని దేశాలకూ ప్రయోజనకరంగా ఉంటుందని ఉదారవాద ఆర్థికవేత్తలు చెప్తున్నది ఎంత డొల్ల వాదనో స్పష్టంగా తెలుతోంది.డాలర్ ఈ విధంగా పెత్తనం చెలాయించగలగడానికి ఒక కారణం 1970 దశకంలో అమెరికాకు, చమురు ఉత్పత్తి దేశాలకు నడుమ కుదిరిన ఒప్పందం. ఆ ఒప్పందాన్ని సౌదీ అరేబియా మధ్యవర్తిత్వంతో కుదుర్చుకున్నారు. దాని ప్రకారం అంతర్జాతీయంగా ముడిచమురు ధరలను డాలర్‌లనో నిర్ణయిస్తారు. ఆ డాలర్లలోనే ఆ చమురు వ్యాపారం సాగుతుంది. చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలర్ ప్రాధాన్యత ఒక్కసారి పెరిగింది. ముడి చమురుకు ఇటువంటి ప్రాధాన్యత ఉంది కనుకనే ఇటీవల పశ్చిమ దేశాలు రష్యాపై ఆంక్షలు విధిం చాక వాటి నుండి తట్టుకోడానికి రష్యా తన ముడిచమురు కొనుగోలు చేసేవారు రూబుళ్లలోనే చెల్లింపులు చేయాలని నిబంధన విధించింది. అయితే, 1970 దశకంలో కుదిరిన ఆ ఒప్పందం ఒక్కటే డాలర్ ఆధిపత్యం నేటికీ కొనసాగడానికి కారణం కాబోదు. డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వ్యాపారం జరగాలన్న భావననే జేనెట్ యె÷-లలెన్ మొదట్లో తేలికగా కొట్టిపారేశారు. కాని ఇప్పుడు ఆమె ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవలసి వస్తోంది. ఇప్పుడు ట్రంప్ డాలర్ పెత్తనాన్ని కాదనుకుంటున్న దేశాలను బెదిరించడానికి పూనుకుంటున్నాడు. అమెరికాకు ఆ దేశాలు ఎగుమతి చేసే సరుకులపై సుంకాన్ని వందశాతం పెంచుతానంటూ రంకెలు వేస్తున్నాడు. అంటే డాలర్ పెత్తనం ఎలాగైనా కొనసాగడానికి అమెరికన్ సామ్రాజ్యవాదం తన శక్తిని వినియోగిస్తోందన్నమాట. ఇటువంటి బెదిరింపుల ప్రభావం బలంగానే ఉంటుంది. ఎందుకంటే డాలర్ ప్రమేయం లేకుండా వ్యాపారం చేసుకోవడం అనేది ఒక్క పట్టున సాధ్యపడేది కాదు. ఈలోపున అమెరికాకు ఆ దేశాలు చేసే ఎగుమతులు కుదించుకు పోతే అప్పుడు ఆ దేశాల దగ్గరుండే డాలర్ నిల్వలు మరీ వేగంగా హరించుకుపోతాయి. అప్పుడు ఆ దేశాలు మరింతగా ఇబ్బందుల పాలౌతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొం దవచ్చు. కాని ఇప్పటికే ఆ దేశాలు ఐ.ఎం.ఎఫ్, లేదా ప్రపంచబ్యాంక్ దగ్గర రుణాలు పొంది వుంటే ఆ రుణాలకు చెల్లించవలసిన వాయిదాలు డాలర్ల రూపంలోనే చెల్లించాలి. ఆ డాలర్ల నిల్వలు హరించుకుపోతే అప్పుడు ఆ దేశాలు రుణ ఎగవేతదారులుగా నిలబడవలసి వస్తుంది. దానివలన కొత్త షరతులను భరించవలసి వస్తుంది.అందుచేత ట్రంప్ ప్రకటిస్తున్న హెచ్చరికలను సీరియస్‌గానే తీసుకోవాలి. ఉదారవాద ఆర్థికవేత్తలు ఎంతో సౌమ్యంగా చిత్రించే సామ్రాజ్యవా దపు ఆధిపత్య రూపం కాస్తా ఇప్పుడీ ట్రంప్ బెదిరింపులతో పూర్తిగా బయటపడి పోయింది! అయితే ఈ బెదిరింపులను ఎదుర్కొనే దేశాలు డాలర్ పెత్తనం నుండి బయటపడవలసిన అవసరాన్ని మరింతగా గుర్తించడానికే ఈ బెదిరింపులు తోడ్పడతాయి. డాలర్-రహిత అంతర్జాతీయ వ్యాపారం పుంజుకోడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. ఈ సంగతి కజన్ శిఖరాగ్ర సమావేశానికీ తెలుసు. ట్రంప్ బెదిరించగానే భారత దేశంతో సహా పలు దేశాలు తమకు ఈ డాల ర్-రహిత వాణిజ్యం పట్ల ఆసక్తి లేదంటూ ప్రకటించాయి. అ మెరికా దృష్టిలో బుద్ధిమంతులని పించుకోడానికి ఈ ప్రకటనలు ఉపయో గపడవచ్చు. కాని అమెరికా పెత్తనానికి సవాలు తీవ్రంగానే ఎదురవుతోం దన్నది మాత్రం వాస్తవం. తమ దేశాల ఆధిపత్యానికి సవాలు తీవ్రంగా ఎదురవుతోందన్న వాస్తవాన్ని గుర్తించిన పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలే కాకుండా ఆ దేశాల్లోని సోషల్ డెమాక్రటిక్ పార్టీలు సైతం ఉక్రెయిన్ విషయంలో గాని, గాజా విషయంలో గాని మరింత ఐక్యంగా వ్యవహరి స్తున్నాయి. అయితే డాల ర్‌కు ప్రత్యామ్నా యంగా ఏ విధమైన అంతర్జాతీయ వ్యవస్థను ఏర్పరచాలన్న వి షయం మీద ఇంకా బ్రిక్స్ దేశాల నడుమ ఒక స్పష్టత రాలేదు. ఇలా ఏర్పడే ఆ ప్రత్యామ్నాయ వ్యవస్థ డాలర్‌కు బదులు మరొక దేశపు కరెన్సీకి ఆధిపత్యాన్ని క ట్టబెట్టేదిగా మాత్రం ఉండకూడదు. అలా జరగాలంటే ఇప్పుడు ఏ సూత్రాల ప్రాతిపదికపై అంతర్జాతీయ వాణిజ్యం సాగుతోందో ఆ సూత్రాలే,ఆ నియమాలే మారిపో వాలి.అంతే కాదు. అంతర్జాతీ య వాణిజ్యంలో వాణిజ్యలోటు పెరుగు తున్న దేశాల మీద ఆ లోటును భర్తీ చేసే భారాన్ని మోపే పద్ధతి కూడా మారాలి.

# పల్లె 'పండుగ'- గ్రామాల్లో రోడ్లు నిండుగా..



కర్నూల్ : పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. పల్లెలకు పూర్వ వైభవం తీసుకురావాలనే ఆలోచనతో కూటమి సర్కార్ 'పల్లె పండుగ' పేరుతో అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలో నూతన కార్యక్రమాన్ని చేపట్టింది. తద్వారా పల్లెల్లో పనుల 'పండుగ' సందడి ప్రారంభమైంది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టి సంక్రాంతికి ముందే పల్లెల్లో అసలైన పండుగ వాతావరణం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. గ్రామాల అభివృద్ధికి ఒక కీలక ముందడుగు వేసింది ప్రభుత్వం..ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 13వేల 326 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలను ప్రభుత్వం నిర్వహించింది. దేశంలో ఇలా జరగడం ఇదే మొదటిసారి.గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించడం జరిగింది. ఆయా పంచాయతీల్లో తీర్మానాలు చేసి తీసుకున్న నిర్ణయాల మేరకు పల్లె సీమల్లో సిమెంటు రహదారులు, బిటి రహదారులు, ప్రహరీలు, గోకులాలు, పారిశుధ్య పనులు చేపట్టాలని నిర్ణయించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే ఈ పనులకు ప్రభుత్వం నుంచి పరిపాలనపరమైన అనుమతి, సాంకేతిక ఆమోదం లభించింది. గ్రామసభల్లో తీసుకున్న నిర్ణయాలు అమలుచేయడానికి అన్ని శాఖలను జిల్లా యంత్రాంగం ద్వారా సమన్వయం చేస్తున్నారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేసి పల్లెలకు అసలైన పండుగ తీసుకురావాలనేది రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం.

### పల్లెలకు పండుగే..

"పల్లె పండుగ -పంచాయతీ వారోత్సవాలు" పేరిట కొత్త కార్యక్రమాన్ని చేపట్టి అక్టోబర్ 14 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలలో అభివృద్ధి పనులకు అంకురార్పణ చేశారు. 'పల్లెపండుగ' వారోత్సవాల్లో భాగంగా రూ.4,500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, గోకులాలు, వాన నీటి సంరక్షణ కందకాలు తదితర పనులను ప్రభుత్వం చేయడానికి సంకల్పించింది.జిల్లాలో రూ 67 కోట్లతో సిసి, బీటీ రోడ్ల నిర్మాణం కొరకు 830 పనులకు ఆమోదం..జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా యంత్రాంగాన్ని వేగంగా సమాయత్తం చేశారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్తున్నారు. గ్రామ సభలో ఆమోదం పొందిన పనులకు సంబంధించి జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం సమన్వయంతో పంచాయతీరాజ్ శాఖ ద్వారా కర్నూలు జిల్లాలో రూ 62 కోట్లతో109 కిలో మీటర్ల మేర సిసి, బీటీ రోడ్ల నిర్మాణం నిమిత్తం 830 పనులకు జిల్లా కలెక్టర్ సత్వరం పరిపాలనపరమైన ఆమోదపు మంజూరు ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లాలో 802 పనులు ప్రారంభించి%ౌ% 541 పనులను పూర్తి చేయగా మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి..

### నియోజకవర్గాల వారీగా సీసీ, బీటీ రోడ్ల పనుల వివరాలు..

సిసి, బీటి రోడ్లతో కర్నూలు జిల్లా లో గ్రామాలు నూతన శోభ సంతరించుకుం టున్నాయి. కూటమి ప్రభుత్వం రాకతో.. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు,

# జమిలి బిల్లుకు టీడీపీ మద్దతు

ఢిల్లీ, జమిలి బిల్లుకు మంగళవారం పార్లమెంట్ సమావేశాల్లో తెలుగుదేశం పార్టీ మద్దతు తెలిపింది. జమిలీ బిల్లుకు మద్దుతు ఇస్తున్నట్లు లోక్‌సభలో తెలిపారు. జమిలి బిల్లును తదుపరి చర్చకు తీసుకోవడంపై ఇవాళ లోక్‌సభలో ఓటింగ్ ప్రక్రియ చేపట్టారు. కొత్త పార్లమెంట్ భవనంలో తొలిసారి ఓటింగ్ జరుగుతుంది. లోక్‌సభలో పూర్తి ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఓటింగ్ విధానాన్ని సభ్యులకు లోక్‌సభ సెక్రటరీ జనరల్ వివరించారు. టీడీపీ ఎంపీ, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బిల్లు ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తూ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మార్పునకు సీఎం చంద్రబాబు ఎప్పుడు ముందుంటారని తెలిపారు. జమిలీ ఎన్నికల వల్ల ఎన్నికల ఖర్చు తగ్గుతుందన్నారు. మీడియా రిపోర్టులు ఆధారంగా జనరల్ ఎన్నికలకు రూ. 6 వేల కోట్లు ఖర్చు అయ్యిందని వివరించారు. జమిలి ఎన్నికల నిర్వహణ వల్ల ఓటింగ్ శాతం ( 7శాతం) పెరుగుతుందని అన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణ వల్ల ఎన్నికల కమిషన్ ఖర్చు, రాజకీయ పార్టీల ఖర్చు తగ్గుతుందని పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు పెట్టడం మంచిదేనని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అయితే జమిలి ఎన్నికలకు ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా చెబితే ఆ విధంగా నడుచుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల కోసం పార్లమెంట్లో చట్టం చేయబోతోందని, దానిని అందరూ ఆమోదించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ బిల్లుకు టీడీపీ పార్టీ మద్దతిస్తుందని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. అభివృద్ధికి అనుకూల బిల్లు కాబట్టి మద్దతిస్తున్నామన్నారు. దేశంలో సుపరిపాలనకు ఈ బిల్లు ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. అభివృద్ధి, సుపరిపాలనపై చర్చ జరిగినప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముందుంటారని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

# విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలి

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర ఎంబీబీఎస్?, బీడీఎస్? విద్యార్థులకు హైకోర్టు బిగ్? రిలీఫ్?ను కల్పించింది. ఇతర రాష్ట్రాల్లో ఉన్నతమైన వైద్యవిద్య కోసం వెళ్లి చదువునభ్యసించిన తెలంగాణ విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో జీవో 140ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం అప్లై చేసుకునే విద్యార్థులలో ఇంటర్ చదువుకు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణ రాష్ట్రంలో చదివిన వారినే స్థానికులుగా పరిగణించేలా ప్రభుత్వం జీవో నెంబర్? 33ను జారీ చేసింది. దీనిపై కొందరు బాధితులు అప్పుడే హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ధర్మాసనం స్థానికతకు సంబంధించిన రూల్స్? అండ్? రెగ్యులేషన్స్?ను కొత్తగా రూపొందించాలని న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది.హైకోర్టు ఆదేశాలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో అత్యున్నత ధర్మాసనమైన సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు గతంలో జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియకు అనుమతించింది. కోర్టులో పిటిషన్? వేసిన 135 మంది వైద్య విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వులను కూడా పరిగణనలోకి తీసుకోవాలంది. సుప్రీంకోర్టు తీర్పుపై ప్రభుత్వం న్యాయశాఖ సమీక్ష చేసింది. న్యాయస్థానం సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆ విద్యార్థులను కౌన్సెలింగ్‌కు అనుమతించింది. కోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థుల మెరిట్ జాబితాను ప్రత్యేకంగా మరోసారి విడుదల చేసింది.తెలంగాణలో ప్రస్తుతం 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో 4,090 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. వాటిలో 15 శాతం సీట్లు ఆలిండియా కోటా కింద భర్తీ అవుతున్నాయి. మిగిలిన సీట్లు తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకే కౌన్సెలింగ్‌లో అందుబాటులో ఉంటాయి. వీటికి అదనంగా ప్రైవేటు కళాశాలల్లో మరో 4,810 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం కన్వీనర్ కోటా కింద భర్తీ అవుతాయి. మిగిలినవి బీ, సీ కేటగిరీ సీట్లుగా అందుబాటులో ఉన్నాయి.

# ప్రతి రోగికి సేవ చేయడమే లక్ష్యం కావాలి

మంగళగిరి,ప్రతీ రోగికీ సేవలందించాలని, ప్రతీ డాక్టర్ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. మంగళగిరి ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఎంబీబీఎస్ విద్యార్థులు డిగ్రీ పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడుతూ 'యువ వైద్యులుగా మీరందరూ అత్యుత్తమ సేవలందించాలి. ఇప్పుడు డాక్టర్లు అయిన వారిలో 2/3 వంతు మహిళా డాక్టర్లు ఉన్నారు. మన భారత మహిళలు, యువతులు అన్ని రంగాలలో ఉన్నతి సాధించాలి. ఎయిమ్స్ మొదటి బ్యాచ్ గా మీరందరూ గుర్తుంటారు. దేశ ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలి. పూర్తి ఆరోగ్యంపై అందరూ దృష్టి పెట్టాలి. ప్రతీరోజూ ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలి. యోగాసనాలు, ప్రాణాయామాలు.. ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడతాయి. సమయం, పరిస్థితులను బట్టి ప్రతీ మనిషి జీవనశైలి ఉండాలని అన్నారు. 'మెడికల్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ తో అందరికీ ఉపయోగపడే సేవలు వైద్యులు అందించాలి. ఆయుష్మాన్ భారత్ ద్వారా దేశ ప్రజలకు ఆరోగ్య సేవలు తేలిగ్గా అందించడమే ధ్యేయం. ప్రపంచ పటంలో భారతదేశం మెడికల్ సేవలలో అందుబాటులో ఉండే దేశంగా నిలవటానికి మన డాక్టర్ల సేవలు మరువలేనివి. ప్రతి రోగికీ సేవలందించాలన్నారు. ప్రతి డాక్టర్ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలి. యువ డాక్టర్లు సేవ చేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నా. ఆరోగ్యకరమైన, అభివృద్ధి సాధించే భారతదేశం మనందరికీ కావాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి మంగళగిరి ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎయిమ్స్ మంగళగిరికి 10 ఎకరాల భూమి ఇస్తాము. దేశంలో ఏ ఎయిమ్స్‌కు కూడా ఇలాంటి భూమి లేదు. అమరావతి భారతదేశపు భవిష్యత్ సిటీ. మంగళగిరి ఎయిమ్స్ భారతదేశంలోనే నంబర్ 1 అవుతుందని నా నమ్మకం. 960 బెడ్లతో, రూ.1618 కోట్లు ఖర్చుతో సిద్ధమైన ఆసుపత్రి.. మంగళగిరి ఎయిమ్స్ సొంతం' అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు ద్రౌపది ముర్మును ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఒక ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చి రాష్ట్రపతి కావడం ఆవిడ సాధించిన విజయంగా ఆయన పేర్కొన్నారు. కష్టపడితే ఈ ప్రపంచంలో సాధించలేనిది ఏదీలేదు అనడానికి ఆమె జీవితం ఒక ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రకమంలో పాల్గొన్న విద్యార్థులను చూసి.. 'అవకాశం ఉంటే నాకు ఇక్కడ చదువుకోవాలని ఉంది' అంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# మెడికల్ పీజీ అభ్యర్థులకు ఊరట

హైదరాబాద్,మెడికల్ పీజీ అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. తెలంగాణ స్థానికత ఉండి ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ చదివినా, తెలంగాణ స్థానికత లేకుండా ఇక్కడ ఎంబీబీఎస్, బీడీఎస్ చదివిన వారిని కూడా స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ జీవోను హైకోర్టు నిలిపివేసింది. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 140ని సవరణ చేయాలని గతంలోనే ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ జీవోను సవాల్ చేస్తూ మెడికల్ పీజీ విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. జీవో 140 ప్రకారం 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదవడంతో పాటు ఎంబీబీఎస్ కూడా ఇక్కడే పూర్తి చేసిన వారికి తెలంగాణ స్థానికత కల్పిస్తారు. ఈ జీవో అమలును ప్రస్తుతం హైకోర్టు నిలిపివేసింది.

# బియ్యం బొక్కిన వారిని వదలబోం

అమరావతి,పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కిన ఏ ఒక్కర్నీ వదలబోమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. నీతులు చెప్పే మాజీ మంత్రి పేర్ని నాని బియ్యం కుంభకోణంపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రూ.90 లక్షల విలువైన బియ్యం మాయం చేసి పారిపోయారని విరుచుకుపడ్డారు. పోయిన బియ్యానికి డబ్బులు చెల్లిస్తామని తన దోపిడీని ఒప్పుకున్నారన్నారు. గత ఐదేళ్ల పాలనలో లక్షల టన్నుల బియ్యాన్ని వైసీపీ మాఫియా బొక్కేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ ఒక దొంగల పార్టీ.. వాళ్ల నాయకుడో గజదొంగ అంటూ వ్యాఖ్యలు చేశారు. తండ్రి కొడుకులు బందరు యువతను గంజాయి మత్తులో నెట్టారన్నారు. అవినీతి కోసం ఇంట్లో మహిళల్ని కూడా రోడ్డుకీడ్చడం దుర్మార్గమన్నారు. బియ్యం కుంభకోణంలో పేర్ని నాని అడ్డంగా బుక్కయ్యాడని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కాగా.. మచిలీపట్నం గోదాంలో బియ్యం మాయం కేసులో పోలీస్, పౌరసరఫరాల శాఖల్లో కదలిక వచ్చింది. వారం రోజులుగా అజ్ఞాతంలోనే మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబం ఉంది. వారిపై పోలీసులు లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. సోమవారం సాయంత్రం అజ్ఞాతం నుంచి పేర్ని నాని బయటకొచ్చారు. ఇంకా పేర్ని నాని సతీమణి జయసుధ అజ్ఞాతం వీడలేదు. గోడౌన్లు ఆమె పేరుతో ఉ ండటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం అమ్ముకున్న పేర్ని నాని అవినీతి కారణంగా ఆయన భార్య జయసుధకు తిప్పలు తప్పడం లేదు. మచిలీపట్నం జిల్లా కోర్టు, ఏపీ హైకోర్టుల్లో ముందస్తు బెయిల్ కోసం పేర్నినాని పిటీషన్లు దాఖలు చేశారు. కోర్టు నిర్ణయం వెలువడే వరకు అజ్ఞాతంలోనే భార్యను పేర్ని నాని ఉంచారు. నాలుగు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నప్పటికీ.. వారి ఆచూకీ కనుగొనడంలో కృష్ణా పోలీసుల వైఫల్యం కనపడుతోంది. కొంతమంది అధికారులు, టీడీపీ నేతలు పేర్ని నానికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఈ కేసును ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

# అడుగులు పడుతున్నయా?

హైదరాబాద్,ఈమధ్య సుప్రీంకోర్టు ఢిల్లీ నగరాన్ని ఏం చేయబోతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా ఉందని,. తాను ఎప్పుడు ఢిల్లీకి వచ్చినా అనారోగ్యం పాలవుతున్నానని ఇటీవల చెప్పుకొచ్చారు. ఇలాంటి పరిణామాల మధ్య ఢిల్లీని దేశ రాజధానిగా ఇంకా కొనసాగించాలా అని సాక్షాత్తు సీనియర్ కాంగ్రెస్ నేత శశి థరూర్ ఈ మధ్య కాలంలో చేసిన వ్యాఖ్యలు ఆలోచింపదగినవి. థరూర్ వ్యాఖ్యలు దేశ రాజధానిపై మరోసారి దేశవ్యాప్త చర్చకు దారితీశాయి..దక్షిణాదిన రెండో రాజధాని ఉండాలన్న ప్రస్తావన చాలా దశాబ్దాలుగా వస్తున్నదే. దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్ ఉండాలన్న చర్చ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే వచ్చింది. ఈ ప్రతిపాదనను రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన 'థాట్స్ ఆఫ్ లింగ్విస్టిక్ స్టేట్స్' అనే పుస్తకం 11వ అధ్యాయంలో హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాలని స్వయంగా ప్రతిపా దించారు. దీనికి అనుకూలంగా కొన్ని బలమైన కారణాలను కూడా చూపారు. మన శత్రు దేశాలైన పాకిస్తాన్, చైనా దేశ సరిహద్దుకు ఢిల్లీ కేవలం 300 కిలోమీటర్ల దూరంలో ఉందని. కానీ, హైదరా బాద్ సుదూరంగా ఉండటం దేశ భద్రతాపరంగా, అన్ని వాతావరణ పరిస్థితులకు అనువైన ప్రాంతమని గట్టిగా వాదించారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ మారింది. గతంలో హైదరాబాద్‌లో ఎత్తైన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు హాజరైన అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ హైదరాబాద్‌ను రెండో రాజధానిగా అంబేద్కర్ గుర్తు చేసినప్పుడు కూడా ఈ చర్చ జరిగింది. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు ఎప్పటికైనా హైదరాబాద్ దేశానికి రెండో రాజధానిగా అవుతుందన్న నమ్మకం ఉందన్నారు. ఇదిలావుంటే, గత ఏడాది రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణం చేసిన తర్వాత నుంచి ముఖ్యమంత్రి హోదాలో తీసుకుంటున్న చర్యలన్ని భవిష్యత్తు దృష్ట్యా హైదరాబాద్‌ను మహా విశ్వనగరంగా మార్చే ప్రయత్నంలో తీసుకుంటున్నవే. ఢిల్లీ తరహా పరిస్థితులు తలెత్తకుండా హైదరాబాద్ రెండో రాజధాని ఖచ్చితంగా కావొచ్చనే ముందుచూపుతోనే హైడ్రాలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాజకీయ విమర్శకులు ప్రశంసిస్తున్నారు. అలాగే, కాలుష్యరహిత నగరంగా మార్చేందుకు డీజిల్/ పెట్రోల్ వాహనాలను తరలించి పొల్యూషన్ రహిత ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం వెనక కారణం కూడా ఇదేనని కొందరి వాదన. అలాగే, ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల్లోని 258 ప్రపంచ నదులలో అత్యంత కాలుష్యంగా మూసీ నది 22వ స్థానంలో ఉన్నట్లు ది ప్రొసీడింగ్స్ ఆఫ్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్ లో ప్రచురితమైంది. కనీసం 70 కిలోమీ టర్ల మేర 48 రకాల క్యాన్సర్ కారకాలైన రసాయన అవశేషాలు లభించాయి. ఈ కలుషితమైన నీరు ప్రజల ఆరోగ్యానికి భారీగా హాని చేస్తోందనీ పరిశోధనలు తేల్చాయి. ప్రతిపక్షాల నుంచి ప్రభుత్వం ఎన్ని విమర్శలు ఎదుర్కొన్నా మూసీ పునరుజ్జీవానికి కట్టుబడి ఉంటామని ప్రకటించ డం, అలాగే ఉన్న నగరంపై మరింత జనసాంద్రత పెరగకుండా ఫోర్త్ సిటీ ఆలోచన కూడా వెనుక కూడా రెండో రాజధాని వ్యూహమే ఉన్నట్లు అనుకోవచ్చే మో! అలాగే, 2019 మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో రెండో రాజధాని ఆలోచనకు మద్దతు ఇచ్చారు. ఇక రెండో రాజధాని ఆలోచన బీజేపీకి ఖచ్చితంగా ఉందని ఆ నాయకుల వ్యవహార శైలి, మాటలు తదితర పరిణామాలతో వెల్లడవుతూ వస్తోంది. రీజనల్ రింగ్ రోడ్డు అనుమతి, విస్తరణ వెనుక బీజేపీ ఆలోచన లేకపోలేదనే అభిప్రాయం విశ్లేషకుల్లో ఉంది. తెలంగాణలో అధికారంలోకి రావాలని భావిస్తున్న బీజేపీ ఇక్కడ తన బలాన్ని పెంచుకునేందుకు అన్ని అస్త్రశస్త్రాలు ప్రయో గించడానికి పావులు కదుపుతోంది. రెండో రాజధాని పేరుతో హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చితే తెలంగాణ మరోసారి భగ్గుమనే అవకాశం ఉంది.

# కేటీఆర్ మెడకు ఫార్ములా ఈ-రేస్!



హైదరాబాద్,సోమవారం తెలంగాణ కేబినెట్ సమావేశం ముగిసిన తరువాత మంత్రి పొంగులేటి మీడియా చిట్ చాట్ లో ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. తెలంగాణలో ఏ బాంబు పేలుతుందో త్వరలో కేటీఆర్ కు తెలుస్తుందని అనటం. దీని ద్వారా కేటీఆర్ అరెస్టు తప్పదని చెప్పకనే చెప్పారాయన. మరోవైపు, తనను ఎప్పుడు అరెస్టు చేస్తారా అని ఎదురుచూస్తున్నట్టుగా ఉంది కేటీఆర్ స్పందన. అరెస్టు చేసుకుంటే చేసుకోండి.. జైల్లో యోగా చేసుకుంటా.. తర్వాత వచ్చి పాదయాత్ర చేసుకుంటా అని. ఈ మధ్య కాలంలో జైలుకు వెళ్లిన వారంతా సీఎంలు అవుతున్నారనే సెంటిమెంట్ తనకు కూడా పని చేస్తుందని కేటీఆర్ అనుకుంటున్నారేమో తెలియదు. కానీ, ఆయన అరెస్టుకు దారితీస్తున్న ఫార్ములా ఈ-రేస్ కు సంబంధించిన కేసుతో ఇప్పుడు తెలంగాణ రాజకీయాలు హాట్ హాట్ గా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాడుతుండగా అదే స్థాయిలో అధికార పార్టీ వైపు నుంచి రీసౌండ్ వస్తోంది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ జరుపుతామని పదే పదే చెబుతున్న కాంగ్రెస్ సర్కార్.. ఆ దిశగానే అడుగులు వేస్తోంది. ఇప్పటికే చాలా విషయాలపై ఏసీబీ విచారణ జరుగుతోంది. ఇందులో ఒకటిగా హైదరాబాద్ ఫార్ములా ఈరేసు కూడా ఒకటి. ఈ వ్యవహారం ఇప్పుడు కేటీఆర్ మెడకు చుట్టుకుంది. ఫార్ములా ఈ కార్ల రేస్ కేసులో కేటీఆర్ ను విచారించేందుకు సర్వం సిద్ధమైంది. ఆయనను ప్రాసిక్యూషన్ చేసేందుకు ఏసీబీకి అనుమతిస్తూ గవర్నర్ ఇచ్చిన లేఖపై సోమవారం కేబినెట్ భేటీలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. సీఎం రేవంత్ ఈ సమావేశంలో ఎంక్వైరీపై నిర్ణయం తీసుకు న్నారు. ఆ వెంటనే సీఎస్ శాంతికుమారి.. గవర్నర్ నుంచి వచ్చిన పర్మిషన్ లెటర్ ను ఏసీబీకి అందజేశారు. దీంతో ఒకటి, రెండు రోజుల్లోనే కేటీఆర్?ను ఏసీబీ విచారణకు పిలిచే అవకాశం కనిపిస్తోంది. ఈ కేసులో కేటీఆర్ పాత్రపై పక్కా ఆధారాలను సేకరించిన ఏసీబీ.. ఆయనను ఎంక్వైరీకి పిలవా లని ఇప్పటికే భావించింది. కానీ, కేటీఆర్ ఎమ్మెల్యే కావడంతో విచారణకు అనుమతించాలని ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ అనుమతి కోరింది. న్యాయ సలహా తీసుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. కేటీఆర్ ప్రాసిక్యూషన్ కు ఇటీవలే అనుమతి ఇచ్చారు. తాజాగా అనుమతి లేఖ కూడా అందడంతో కేటీఆర్ ను ఎంక్వైరీకి పిలిచేందుకు ఏసీబీ ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇప్పటికే ఆయన పాత్రకు సంబంధించిన ఆధారాలను సేకరించిన ఏసీబీ అధికారులు.. విచారణ సందర్భంగానే అదుపులోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సీజన్ 9 ఫార్ములా ఈ కార్ల రేస్తో పాటు నిర్వహించాలని భావించిన సీజన్ 10 ఫార్ములా ఈ-రేస్ కు నాటి రాష్ట్ర కేబినెట్ తో పాటు నాటి సీఎం ఆమోదం లేదు. సీజన్ 9 నిర్వహణకు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం హెచ్ఎండీఏ రూ.20 కోట్లు ఖర్చు చేసింది. స్టాల్స్, ప్రచారం, సీటింగ్, వీధిదీపాల లాంటి వాటికోసం 'నెక్స్ జెన్ గ్రీన్ కో' అనే ప్రైవేటు సంస్థ రూ.150 కోట్లు ఖర్చు చేసింది. ఇంకో రూ.30 కోట్లను 'హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్' ఖర్చు పెట్టింది. సీజన్? 9లో నాటి రాష్ట్ర ప్రభుత్వం, గ్రీన్ కో (నెక్స్ జెన్), ఫార్ములా ఈ (ఎఫ్ఈఓ) ఉన్నాయి. ఈ సీజన్ లో నాటి రాష్ట్ర ప్రభుత్వం/ హెచ్ఎండీఏ కేవలం ఫెసిలిటేటర్ గానే ఉ ంది. ఫెసిలిటేటర్ గా ఉన్న ప్రభుత్వ పాత్ర.. కేవలం ఏర్పాట్లకు సహకరించడం మాత్రమే! లాభనష్టాలతో సర్కారుకు ఎలాంటి సంబంధం లేదు. ఫార్ములా ఈ-రేస్ ను ప్రమోట్ చేసిన గ్రీన్ కోకు సీజన్ 9లో చాలా నష్టం వచ్చింది. దీంతో ప్రైవేట్ ప్రమోటర్ గా ఉన్న గ్రీన్ కోను సీజన్ 10 నుంచి తప్పించి ఫార్ములా ఈ(ఎఫ్ఈఓ)తో ఒప్పందం చేసుకున్నారు. ఇక సీజన్ 10కు సంబంధించి ఫార్ములా -ఈ రేస్ అగ్రిమెంట్ కు ముందే అదీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అక్టోబర్ 2023న రూ.55 కోట్లు హెచ్ఎండీఏ చెల్లించింది. అది కూడా విదేశాల్లో ఉన్న కంపెనీకి ఆర్బీఐతో పాటు ఇతరత్రా ఎలాంటి పర్మిషన్లు లేకుండానే చెల్లింపులు చేశారు. ఏదైనా ప్రైవేట్ ఏజెన్సీ లేదా కంపెనీలతో ఇలాంటి ఈవెంట్లు నిర్వహించేముందు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవాలి. కానీ, సీజన్? 10 విషయంలో ఒప్పందం కంటే ముందే ఫండ్స్ చెల్లించే శారు. నిధులు పంపిన 18 రోజులకు అదీ ఎన్నికల కోడ్ సమయంలో ఒప్పందం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఈసీ నుంచి ఎలాంటి పర్మిషన్లు తీసుకోలేదు. ఈ ఒప్పందం వల్ల హెచ్ఎం డీఏ(రాష్ట్ర ప్రభుత్వం) పై రూ.200 కోట్ల భారం పడింది. న్యాయ వివాదాలు వస్తే లండన్ కోర్టులో తేల్చుకోవాలనే నిబంధన ఉంది. ఎఫ్ఈఓ (ఫార్ములా-ఈ) వ్యక్తులెవరూ సెక్రెటేరియెట్ కు రాలేదు. ముఖాముఖి చర్చలు కూడా జరగలేదు. చర్చలన్నీ ఈ-మెయిల్ ద్వారానే జరిగాయి. దీంతో విదేశీ కంపెనీకి వెళ్లిన ప్రభుత్వ సొమ్ము రూ.55 కోట్లను అప్పటి స్పెషల్ సీఎస్ అర్వింద్ కుమార్ చెల్లిం చాలంటూ ప్రస్తుత ప్రభుత్వం ఆయనకు నోటీసులు పంపింది. కాగా, ఈ విషయంలో తన పాత్ర ఏమీ లేదని.. అప్పటి మంత్రి కేటీఆర్ చెప్తేనే చేశానని అర్వింద్ కుమార్ సమాధానం ఇచ్చారు. దీంతో ఈ వ్యవహారంలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఎంక్వైరీ కోసం ఏసీబీకి ఆదేశించింది. మరోవైపు, ఈ కేసు వ్యవహారంపై కేటీఆర్ పలుమార్లు స్పందించిన విషయం తెలిసిందే. ఈ-రేస్‌కు కోసం ప్రభుత్వం తరపున చేసిన ఖర్చు కేవలం రూ. 40 కోట్లు మాత్రమే అని? కానీ హైదరాబాద్‌కు వచ్చిన ప్రయోజనం రూ. 700 కోట్లు అని క్లారిటీ ఇచ్చారు. ఇదే విషయాన్ని నీల్సన్ అనే సంస్థ కూడా చెప్పిందని గుర్తు చేశారు. ఫార్ములా ఈ-రేస్, మొబిలిటీ వీక్ అనే కార్యక్రమం ద్వారా దాదాపు రూ. 2,500 కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ-రేస్‌ను ప్రభుత్వం తరపున కార్యక్రమంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు రూ. 55 కోట్లు ఖర్చు చేశామని కూడా చెప్పుకొచ్చారు. ఇందులో అరవింద్ కుమార్ తప్పు ఏం లేదని నేను ఈ మొత్తానికి బాధ్యత తీసుకుంటానని కూడా స్పష్టం చేశారు. పురపాలక శాఖలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పురపాలక శాఖలో ఇంటర్నల్‌గా డబ్బు అడ్జస్ట్‌మెంట్ చేసుకోవచ్చని దీనికి కేబినెట్ అప్రూవల్ అవసరం లేదన్నారకు. హెచ్ఎండీఏ స్వతంత్ర బోర్డు అన్న కేటీఆర్ ఈ-రేస్ కారణంగా 49 దేశాల్లో హైదరాబాద్ పేరు తెలిసేలా చేశామన్నారు. ఈ కేసులో ఎలాంటి విచారణకైనా సిద్ధమేనంటూ కామెంట్స్ కూడా చేశారు. ఏదేమైనా ఇవాలో రేపో ..ఎప్పుడైనా కానీ కేటీఆర్ అరెస్టు మాత్రం తప్పదని అర్థమవుతోంది.

# నిజాన్ని గడప దాటిద్దామా?




హైదరాబాద్,నిజాలు షూ లేస్ కట్టుకునేలోగా.. అబద్ధాలు మారథాన్ చేస్తున్నాయి... పట్టుకుందామన్నా పాదరసంలా జారిపోతున్నాయి. మనం మాత్రం సోషల్ మీడియా సునామీలో.. నిజానిజాలు తేల్చుకోలేని సుడిలో.. ఈదుతున్నాం... కొట్టుకుపోతున్నాం.. కాదంటారా? తారలు నేల పైకి ఎప్పటికీ దిగిరావు.. కానీ సినిమాల్లో మెరిసే ఈ తారలు మాత్రం ఇప్పుడు నేలకు దిగి వచ్చాయి. అనుకోని ఘటనలు వారిని వార్తల్లో ఉంచుతున్నాయి. కలెక్షన్లు, కటౌట్లు, రేటింగులు.. ఇవన్నీ కాదని వివాదాస్పద ఘటనలతో జన సామాన్యం అరచేతిలోని సెల్‌లో చిక్కుకుపోతున్నారు. నిన్నటి వరకు ఓ సీనియర్ హీరో, నేడు యువ హీరో.. ఈ రెండు ఘటనల్లో సామాన్య ప్రజల్లో ఉత్సుకత.. అభిమానుల్లో ఆందోళన, సోషల్ మీడియాకు మసాలా..! ఈ ఎపిసోడ్ ఎన్ని రోజులు కొనసాగుతుందో చూడాలి.సినిమా ప్రముఖులు వివాదాల్లో చిక్కుకోవడం కొత్త ఏమీ కాదు. నాటి నుంచి నేటి వరకు ఏదో సమయంలో ఏదో ఒక సందర్భంలో వార్తల్లో నిలిచిన వారే. అయితే అటువంటి సందర్భంలో ప్రజలు ఎలా స్పందిస్తున్నారు .. ఆ ప్రతిస్పందనలు, భావోద్వేగాలను ఎవరు పురిగొల్పుతున్నారు అనేది ప్రస్తుత సందర్భం. సీనియర్ హీరో కుటుంబంలో గొడవలు వారి వ్యక్తిగతం. ఎవరి ఇళ్లలో గొడవలు లేవు చూపించండి అంటూ ఆయన వేసిన ప్రశ్న సమంజసమే. కాకపోతే ఆయన సెలబ్రిటీ కావటమే ఇక్కడ పాయింట్. చట్టం, మీడియా వాటి పని అవి చేసుకొని పోయాయి. సోషల్ మీడియా ఒక అడుగు ముందుకేసి తీర్పులు కూడా చెప్పింది. నాలుగు రోజులు పాటు సీరియల్ లాగా సాగిన ఈ కుటుంబ గొడవ ఆసక్తి ఉన్నవారికి మాత్రం ఎంటర్టైన్మెంట్‌గా మారింది. బిగ్ బాస్ షో కంటే ఎక్కువ మసాలా వారికి ఇక్కడ దొరికింది మరి. అయితే ఎవరినీ తప్పు పట్టాల్సిన అవసరం మాత్రం లేదు. దాని నుంచి మనం ఏం తీసుకుంటున్నాం అనేది ప్రశ్న. చూశారా.. చూశారా.. అంత పెద్ద వాళ్లే కొట్టుకుంటున్నారు... మనం ఎంత అని సమర్ధించుకుంటున్నామా..? అయ్యో అంటూ జాలి పడుకున్నామా? ఇలా జరిగి ఉండాల్సింది కాదు అంటూ.. అభిప్రాయపడుతున్నామా..? ఏ సంఘటనైనా దాని ప్రభావం నాలుగు రోజులే..!

**బిగ్ బ్రేకింగ్ న్యూస్ అంటే ఇవేనా..?**

మళ్లీ ఇంకో సంఘటన .. దానిపై చర్చ. యువ హీరో అరెస్టుతో కెమెరాలు, మైకులు అన్ని అటు మళ్లాయి. కాసేపు సీనియర్ హీరో విషయం మర్చిపోయారు. అరెస్ట్ దగ్గర నుంచి.. రెప్పవేసే సమయం కూడా ఇవ్వలేదు. మళ్లీ అవే కామెంట్లు, తీర్పులు. కాఫీ తాగుతూ.. కారు ఎక్కుతూ మొదలైన సీన్లు.. తెల్లవారి విడుదల అయ్యేంతవరకు కునుకు కూడా లేదు. అరెస్టు.. రిమాండ్.. లంచ్ మోషన్ పర్మిషన్.. హియరింగ్.. ఆర్డర్ కాపీ టైపింగ్, కరెక్షన్స్, సిగ్నేచర్, ఆన్లైన్ అప్లోడింగ్.. వీటిలో చాలా పదాలకు మనకు అర్థం కూడా తెలియదు. వాటినే ప్రచారం చేశారు. 'క్యూరియాసిటీ కిల్డ్ ది కాట్,' అని ఇంగ్లీషులో ఓ సామెత ఉంది. అలా అయింది వాళ్ళ పరిస్థితి. అంతటితో అయిపోలేదు. హీరోకు పరామర్శలు మరో ఎపిసోడ్. అరెస్టు రోజే ఏపీలో అధికార పక్షం ప్రతిష్టాత్మకంగా విజన్ డాక్యుమెంట్‌ని విడుదల చేసింది. ప్రతిపక్షం రైతుల పక్షం వహించి ధర్నా చేసింది. అంతకు ముందు రోజు డజను మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్ అయ్యారు. దేశ రాజధానిలో పార్లమెంటు సమావేశాలు సాగడం లేదు. ఇవన్నీ స్క్రోలింగ్‌లకి పరిమితం అయ్యాయి. బిగ్ బ్రేకింగ్ న్యూస్ ఎలాగూ హీరోల అప్డేట్స్ ఉన్నాయి కదా..!

**పంచనామా, పోస్ట్ మార్టమ్, తీర్పు...**

ఈ రెండు సందర్భాలలో సోషల్ మీడియాలో ప్రజా స్పందన గమనార్హం. ట్విట్టర్, వాట్సాప్, ఫేస్బుక్.. ఒకటేమిటి ఒకదాని వెంట ఒకటి చెక్ చేస్తూ.. గంట గంటకు మారిపోతున్న ట్విస్టులను నరాలు తెగి పోయేంత ఉత్కంఠతో చూస్తూ.. కళ్ళన్నీ సెల్ ఫోన్‌కి అప్పగించి.. వార్తల వెంట పరిగెట్టి .. అలుపొచ్చినా ఆగలేదు. ఆ ఇంటి గొడవ.. ఈ ఇంట అరెస్టు ప్రతి ఇంట్లో ముచ్చట గా మారింది. శ్రీ శ్రీ అన్నట్లు ఏది సత్యం, ఏదసత్యం.. ? ఈ ఘటనల ప్రభావం స్వల్పకాలికమే.. నాలుగు రోజులకో మరో నెలకు మరో సెలబ్రిటీ ఇంట్లో ఇంకో ఘటన జరుగుతోంది. అది వ్యక్తిగతమా.. వృత్తి గతమా.. అనవసరం. సోషల్ మీడియా పంచనామా మొదలు పెడుతుంది.. పోస్టుమార్టం చేస్తుంది.. తీర్పులు చెబుతుంది సానుభూతి చూపిస్తుంది.. దానిపనే అది.. మన ఎమోషన్స్ దానికి చమురు. చెప్పేవాడికి వినేవాడు లో అనే సామెత ఉండనే ఉంది కదా.

**ఇవి ఆకలిని తగ్గిస్తాయా..?**

కానీ మనకేమైంది..? ఎందుకు వాటిని వైరల్ చేస్తున్నాం. ఎవరి సమస్యలు వారికి లేవా..? కడుపునిండా అన్నం తిని కంటి నిండా నిద్రపోతోంది ఎంతమంది..? జీవనం కోసం ఉరుకులు పరుగులు పెడుతున్నాం... వరల్డ్ హ్యాపీ ఇండెక్స్‌లో 126 స్థానంలో ఉన్నాం. అత్యంత పేదరికంలో 13 కోట్ల మంది పౌరులు ఉన్నారు.. ఇది నిజం. ఇంత పెద్ద లెక్కలు మనకెందుకులే వదిలేద్దాం. అయితే ఇటువంటి ఘటనలపై ఆసక్తి చూపించడం ఆనందాన్ని పెంచుతాయా.. ఆకలిని తగ్గిస్తాయా..? కాస్త ఆలోచిద్దాం.. నిజం గడప దాటే వరకైనా ఆగుదాం.. ! అంతరిక్షానికి చేరువ అవుతున్నాం.. మన చెవులను కాస్త ఆ గోడ నుంచి.. తీసేద్దాం....!

# మరోసారి స్కూళ్లకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో స్కూళ్లకు బాంబు బెదిరింపులు రావడం నిత్యకృత్యంగా మారింది. గత వారం రోజుల్లో ఏకంగా మూడుసార్లు ఢిల్లీ పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి బెదిరింపులు వచ్చాయి. మంగళవారం ఉదయం ఢిల్లీలోని కొన్ని పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. దక్షిణ ఢిల్లీలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్, నార్త్ వెస్ట్ ఢిల్లీలోని సరస్వతి విహార్‌లో గల ఓ పాఠశాలకు బెదిరింపులు వచ్చినట్లు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇ-మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఆయా పాఠశాలల వద్దకు చేరుకొని

# మందేసీ... చిందేసిన ఎమ్మెల్యే

బాపట్ల, ఓ నేత పుట్టిన రోజు వేడుకల్లో షాంపైన్ పొంగించడానికి ఎమ్మెల్యేకు ప్రొటోకాల్ గుర్తుచేసి దానిని ఓపెన్ చేసే మహద్భాగ్యం సదరు నేతకు కల్పించడం, మందేసి చిందేయడం వీటన్నింటికీ బాపట్లలోని పాండురంగాపురం బీచ్ వేదికగా నిలిచింది. ఈ నెల 11న బాపట్లకు చెందిన బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పుట్టిన రోజు కావడంతో, పదో తేదీ అర్ధరాత్రి నుంచే పాండురంగాపురం బీచ్ వేదికగా వేడుకలకు తెర తీశారు. బాపపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత అనంత వర్మతో పాటు పలువురు నేతలు, అనుచరులు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. వేడుకల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మందు గ్లాసు చేతిలో పట్టుకుని చిందేసిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో పాటు వారి మధ్య జరిగిన సంభాషణలు కూడా ప్రజల్లో చర్చకు దారి తీశాయి. వేడుకల్లో భాగంగా షాంపైన్ బాటిల్ ఓపెన్ చేసే క్రమంలో అన్నీ ఆయనే ఓపెన్ చేయాలా అని ఒకరంటే.. ప్రొటోకాల్ అని వైసీపీ నేత అనంతవర్మ అనడం, సదరు బాటిల్‌ను ఎమ్మెల్యే నరేంద్రవర్మే ఓపెన్ చేయడం ఇవన్నీ కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పుట్టిన రోజు వేడుకలు జరిగి వారం గడిచాక అక్కడ అంతర్గతంగా జరిగిన వీడియోలు బయటకు రావడం వెనక అక్కడ వేడుకల్లో పాల్గొన్న వారే కావాలనే వీటిని బయటకు విడుదల చేశారనే అనుమానాన్ని నేతలు వ్యక్తం చేస్తున్నారు.

**సాధారణమే కానీ..**

ప్రైవేటు కార్యక్రమంగా జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో మందేయడం, చిందేయడం, మ్యూజికల్ నైట్ ఇవన్నీ కూడా సర్వ సాధారణమే. కానీ ఆ వేడుకల్లో పాల్గొన్నది ప్రస్తుతం టీడీపీ తరపున బాపట్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కావడంతో ఆ మందు, విందులపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

# ఏనుగుల రాకేశ్‌రెడ్డి శాంతిహోమం

రాజన్న సిరిసిల్ల, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వేములవాడ రాజన్న కోడెలను కబేళాలకు తరలించడంతో, ఇదే అంశంపై మెజారిటీ ప్రజల విశ్వాసాలను కాపాడటం కోసం, రాజన్న కోడెల విశిష్ఠత కాపాడటం కోసం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలతో మంగళవారం వేములవాడలో స్థానిక నాయకులతో కలిసి శాంతి హోమం జరిపించినట్లు ఏనుగుల రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు. పరమ శివుడు, ఆదిదేవుడు, రుద్రేశ్వరుడు వేములవాడ రాజన్న కోడెలను కబేళాలకు తరలించిన పాపానికి, పాప ప్రక్షాళన కోసం, ప్రాయశ్చిత్తం కోసం ఓరుగల్లు ప్రజల తరుపున, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని రాజన్న భక్తుల తరుపున, కోట్లాది హిందువుల పక్షాన కేటీఆర్ సూచనలతో వేములవాడలో శాంతి హోమం నిర్వహించినట్లు రాకేశ్ రెడ్డి తెలిపారు. రాజు తప్పు చేసినా, మంత్రి తప్పు చేసినా ఆ ప్రభావం రాజ్యం మీద, ప్రజల మీద కూడా ఉంటుంది. కాబట్టి, ఆ ప్రభావం నుండి రక్షించుకోవడమే మా ఉద్దేశ్యం అని రాకేశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఓరుగల్లు ఒక గొప్ప శైవ క్షేత్రం. అడుగడుగునా శివాలయాలలో విలసిల్లుతున్న గడ్డ, సుమారు 400 ఏళ్లపాటు ఓరుగల్లు రాజధాని కేంద్రంగా పాలన చేసిన కాకతీయులు గొప్ప శివ భక్తులు. అలాంటి, ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తూ, ప్రజా విశ్వాసాలకు విరుద్ధంగా స్వయంగా తన సిఫారసుతో రాజన్న కోడెలను కోతకు పంపి ప్రజల నమ్మకాలను, మనోభావాలను హత్య చేసింది మంత్రి కొండా సురేఖ. కాబట్టి, అంతటి అపచారానికి ప్రాయశ్చిత్తంగా, ఓరుగల్లు బిడ్డగా, శివ భక్తుడిగా ఆ పరమ శివుడికి శాంతి కలిగించడం కోసం శాంతి హోమం నిర్వహించి, కోడెను చెల్లించడం జరిగిందని ఏనుగుల రాకేశ్ రెడ్డి తెలిపారు.

# జనసేనలో చేరనున్నారా?

అమరావతి,తాను గెలవకపోయినా పర్లేదు కానీ.. తన ప్రత్యర్థిని మాత్రం ఓడించాలని కంకణం కట్టుకున్నారు ఆ మాజీ ఎమ్మెల్యే. మొత్తానికి ఆయన అనుకున్నట్టే ఓట్లు చీల్చగలిగి.. పరోక్షంగా ప్రత్యర్ధి ఓటమికి కారణం అయ్యారు. ఇక ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి వైపు తొంగిచూస్తున్నారు ఆ ఎమ్మెల్యే. ఆయన చేరికకు అడ్డుగా ఉన్న మరో కీలక నేత ఎవరు ? భవిష్యత్తు విషయంలో డైలమాలో పడ్డ ఆ ఎమ్మెల్యే ఎవరు ఎవరు ?

**హాట్ టాపిక్ గా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్**

చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒకానొక టైంలో జిల్లా రాజకీయాలను ఏలిన నేత. కానీ ఇప్పుడు ఆయన రాజకీయ భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. చీరాల సెగ్మెంట్లోని వేటపాలెం జడ్పీటీసీ సభ్యుడిగా గెలిచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆమంచి.. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా చీరాల నుంచి పోటీ చేసి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 2014లో నవోదయం పార్టీ అభ్యర్థిగా ఆటో గుర్తుపై రెండో సారి పోటీ చేసి చీరాలలో తిరిగి విజయం సాధించారు. తర్వాత టీడీపీలో చేరిన ఆయన.. మంత్రి పదవి ఆశించి.. అది దక్కకపోవడంతో గత ఎన్నికల ముందు వైసీపీ నీడకు చేరారు.

**2019 గత ఎన్నికల ముందు వైసీపీ గూటికి చేరిన ఆమంచి**

2019 ఎన్నికల్లో చీరాల నుంచి పోటీ చేసిన ఆయన టీడీపీ అభ్యర్ధి కరణం బలరామకృష్ణమూర్తి చేతిలో పరాజయం పాలయ్యారు. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాలతో కరణం బలరాం వైసీపీలో చేరడంతో.. చీరాలలో కరణం, ఆమంచిల మధ్య ఆధిపత్యపోరు తీవ్ర స్థాయికి చేరింది. వారి విభేదాలకు చెక్ పెట్టడానికి వైసీపీ అధ్యక్షుడు ఆమంచిని పర్చూరు వైసీపీ ఇంచార్జ్ గా పంపారు. అక్కడ గెలవడం కష్టమన్న భావనతో ఆమంచి తిరిగి చీరాలకు వచ్చి అక్కడ నుంచి పోటీ చేయడానికి గ్రౌండ్ వర్క్ కూడా చేశారు.అయితే చీరాల వైసీపీ టికెట్ తనకే దక్కుతుందని ధీమాతో కనిపించిన ఆమంచికి జగన్ షాక్ ఇచ్చారు. చీరాల వైసీపీ టికెట్ ఎమ్మెల్యే బలరాం కుమారుడు కరణం వెంకటేష్‌కు కేటాయించి.. ఆమంచికి పర్చూరు టికెట్ ఆఫర్ చేశారు. అందుకు ఆమంచి తిరస్కరించి.. తన రాజకీయ జీవితం ఇచ్చిన చీరాలకే ఫిక్స్ అవుతానని వైసీపీకి గుడ్ బై చెప్పేశారు.

**కాంగ్రెస్ తరపున పోటీ చేసి నలభై వేల ఓట్లు సాధించిన వైనం**

ఇక గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు ఆమంచి కృష్ణమోహన్. తన ప్రత్యర్ధిని ఓడిస్తానని చెప్పి మరి చేసి చూపించారు ఆమంచి. చీరాల నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఆయన.. నలభై వేల ఓట్లు సాధించారు. వైసీపీ తరపున పోటీ చేసిన కరణం వెంకటేశ్ ఓట్లు చీల్చడంలోనూ.. ఆయన ఓటమి లోనూ.. అమంచి చాలా కీలకపాత్రే పోషించారు. మొత్తానికి తాను అనుకున్న గోల్ అయితే రీచ్ అయిన ఆమంచి.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉన్నా అంత సంతృప్తిగా ఫీల్ కావడం లేదట. ఈ వ్యవహారమే ఇప్పుడు పొలిటికల్ గా హాట్ టాపిక్ గా మారింది.

**ఆమంచి జనసేనలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చర్చ**

ఆమంచి కృష్ణ మోహన్ జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చర్చ జరుగుతోంది. ఇప్పటికే జనసేన పార్టీ వర్గాలతో సైతం ఆయన సంప్రదింపులు జరిపినట్లు టాక్ నడుస్తుంది. గతంతో కూడా తాను పవన్ కల్యాణ్ పై చేసిన విమర్శలు.. వైసీపీ అధిష్టానం సూచిస్తేనే మాట్లాడినట్టు పలు వేదికల్లో ఓపెన్ గానే వ్యాఖ్యానించారు. ఎలక్షన్ కి ముందు కూడా ఆయన జనసేనలో చేరతారని జోరుగా ప్రచారం జరిగింది. దాంతో మళ్లీ ఆమంచి జనసేన లో జాయినింగ్ అంటూ వాదనలు వినిపిస్తున్నాయి.

# ఎన్‌సిపి (అజిత్ పవార్ వర్గం)లోనూ అసంతృప్తి



ముంబయి : ఇటీవల మంత్రివర్గ విస్తరణపై ఎన్‌సిపి (అజిత్ పవార్ వర్గం)లోనూ అసంతృప్తి చెలరేగింది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్ పై ఆ పార్టీ సీనియర్ నేత, సమతా పరిషద్ వ్యవస్థాపకులు చగన్ భుజ్ బల్ మంగళవారం నిప్పులు చెరిగారు. ''నేనేమైనా వారి చేతుల్లో కీలు బొమ్మనా' అంటూ మండిపడ్డారు.తనకు మంత్రి పదవి ఇచ్చే అంశంపై అజిత్ పటేల్, ప్రఫుల్ పటేల్‌లు తనతో చర్చ జరుపుతామని అన్నారని, కానీ తనతో చర్చించలేదని అన్నారు. వారి కార్యాలయాల నుండి తనకు ఫోన్ రాలేదని అన్నారు. తానేమీ వారి చేతుల్లో కీలుబమ్మను కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చగన్ అంటే వారి చెప్పుచేతుల్లో ఉండే వ్యక్తి కాదని అన్నారు. వారు కూర్చోమంటే కూర్చుని, నిల్చోమంటే నిల్చునే కీలు బొమ్మని కాదని ధ్వజమెత్తారు. సాధారణంగా మంత్రి పదవులు ఎవరికి కేటాయించాలని ఆ పార్టీ అధ్యక్షులు నిర్ణయిస్తారని, అయితే తనకు మంత్రి పదవి రాకుండా ఎవరు అడ్డుకున్నారో తెలుసుకుంటానని అన్నారు.మంత్రి పదవి దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురైన చగన్ ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశాలను దాటవేయాని నిర్ణయించుకున్నారు. మంగళవారం నాసిక్‌కు చేరుకున్న ఆయన తన మద్దతుదారులతో సమావేశమయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు.

# జనసేనలోకి మంచు మనోజ్, మౌనిక?

హైదరాబాద్,మంచు కుటుంబ తగాదాలో కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. మోహన్ బాబు చిన్న కొడుకు మంచు మనోజ్, ఆయన భార్య మౌనిక రాజకీయ రంగ ప్రవేశానికి సర్వం సిద్ధమైనట్టు ప్రచారం చక్కర్లు కొడుతోంది. ఈ పొలిటికల్ అరంగేట్రానికి ఆళ్లగడ్డ వేదిక కానున్నట్టు సమాచారం. సోమవారం, మాజీ ఎమ్మెల్యే శోభానాగిరెడ్డి జయంతి. ఈ సందర్భంగా ఆళ్లగడ్డలో వేడుకల్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మనోజ్, మౌనిక దంపతులకు ఆహ్వానం వెళ్లింది. అయితే వీరిద్దరూ ఏకంగా వెయ్యి కార్లతో భారీ ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అనంతరం, భూమా ఘాట్ నుంచి రాజకీయ ఆరంగేట్రంపై ప్రకటన చేస్తారని చర్చ నడుస్తోంది. అందులో భాగంగా తమ బలం నిరూపించుకునేందుకు ఇలా ర్యాలీగా వస్తున్నారనే సమాచారం. భూమా కుటుంబంలో ప్రస్తుతం టీడీపీ నుంచి నాగిరెడ్డి పెద్ద కూతురు అఖియప్రియ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. అయితే, అఖిలప్రియతో ఉన్న కొన్ని ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాల నేపథ్యంలో మౌనిక.. జనసేన వైపు చూస్తున్నారనే టాక్ నడుస్తోంది. ఈ కారణంగానే జనసేనలో చేరుతున్నట్టు వార్తలు వినిపిస్తుయి. జనసేనలో ఉంటే టికెట్ కూడా దక్కే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.ఇక, మౌనిక పొలిటికల్ ఎంట్రీపై మనోజ్ గతంలోనే కీలక కామెంట్స్ చేశారు. అంతకుముందు తిరుమల దర్శనానికి వెళ్లిన సమయంలో మనోజ్ మాట్లాడుతూ.. మౌనిక రాజకీయాల్లోకి వెళ్లితే కచ్చితంగా తన మద్దతు ఉంటుందన్నారు. ఇదే సమయంలో తనకు మాత్రం రాజకీయాల్లోకి వచ్చే ఆసక్తి లేదన్నారు. రాజకీయాల్లోకి రాకపోయినప్పటికీ ప్రజలకు సేవ చేయాలనే కోరిక మాత్రం తనకు ఉందన్నారు. నిజానికి, భూమా కుటుంబం రాజకీయాల్లో ఎప్పటి నుంచో ఉంది. భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డిలు కర్నూలు జిల్లా రాజకీయాల్లో కీలక నేతలు.. వారి మరణం తర్వాత భూమా నాగిరెడ్డి పెద్ద కుమార్తె అఖిలప్రియ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆమె 2014



ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున ఆళ్లగడ్డ నుంచి పోటీచేసి విజయం సాధించారు. తండ్రి నాగిరెడ్డి నంద్యాల నుంచి పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఇద్దరు టీడీపీలో చేరగా.. కొంతకాలానికి నాగిరెడ్డి మృతి చెందారు. ఇక, భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డి కూడా రాజకీయాల్లో ఉన్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల బాధ్యతల్ని భూమా కుటుంబమే చూసుకుంటోంది. ఇప్పుడు భూమా మౌనిక పొలిటికల్ ఎంట్రీపై చర్చ జరుగుతోంది.ఇదిలావుండగా, తన పొలిటికల్ ఎంట్రీపై జరుగుతున్న ప్రచారంపై మనోజ్ స్పందించారు. ప్రస్తుతానికి ఏమీ మాట్లాడలేనని అన్నారు. అత్త గారి జయంతి నాడు మొదటిసారి తమ కూతురు దేవసేన శోభను ఆళ్లగడ్డ తీసుకొచ్చామని, జయంతి రోజు తీసుకొద్దామనే ఇన్నాళ్లూ ఇక్కడకు తీసుకురాలేదు. తమ కుటుంబం, సోదరులు, స్నేహితులతో కలిసి ఇక్కడకు వచ్చానన్నారు. కానీ రాజకీయాల్లోకి రావటాన్ని మాత్రం కొట్టిపారేయలేదు. కాబట్టి, మనోజ్ మౌనిక పొలిటికల్ ఎంట్రీ ఖాయమనే అనుకోవచ్చు.

# జోగితో రాసుకుంటే...సీన్ సితారేనా ?



అమరావతి,జోగీ జోగీ రాసుకుంటే బూడిద రాలుస్తుంది అన్నది ముతక సామెత. వైసీపీ నేత మాజీ మంత్రి జోగి రమేష్ తో రాసుకుని పూసుకుని తిరిగితే ఏమవుతుంది అన్నది మాత్రం తెలుగు తమ్ముళ్లే పక్కాగా చెప్పగలరు. నిన్నటికి నిన్న సర్దార్ గౌతు లచ్చన పేరిట విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో జోగి రమేష్ కనిపించి అందరికీ షాక్ కి గురి చేశారు. అది గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సభ అయినా అక్కడకు వచ్చిన వారు అంతా టీడీపీకి చెందిన వారే.మరి జోగి రమేష్ ని ఎవరు పిలిచారో ఆయన ఎందుకు వచ్చారో రాజకీయ కారణాలు అయితే తెలియవు కానీ దాని మీద నారా లోకేష్ చంద్రబాబు మాత్రం ఘాటుగానే రియాక్ట్ అయినట్లుగా ప్రచారం సాగింది. జోగి రమేష్ తో రాసుకుని పూసుకుని తిరుగుతారా అంటూ తమ్ముళ్లను మందలించారని కూడా ప్రచారం సాగింది.దానికి మంత్రి కొలుసు పార్ధసారధి అయితే మీడియా సమావేశం పెట్టి మరీ చంద్రబాబుకు సారీ చెప్పారు. అది పార్టీ కార్యక్రమం కాదని మాత్రమే తాము భావించామని అన్నారు. జోగి రమేష్ అక్కడికి ఎందుకు వచ్చారో తెలియదని చూసి తాను ఆశ్చర్యపోయాను అని వివరణ ఇచ్చారు. అంతే కాదు జోగి రమేష్ తో తనకు ఎటువంటి వ్యక్తిగత అనుబంధమూ లేదని తేల్చేశారు.తనకి పిలిచి టికెట్ ఇచ్చి మంత్రిని చేసిన చంద్రబాబు మనసు బాధపడి ఉంటే క్షమాపణలు అని ఆయన పెద్ద మాటే వాడారు. అలాగే పార్టీకి అన్ని విషయాలు తెలుసు అని తాము ఎపుడూ ఇలా చేయమని కూడా తెలుసు అని ఆయన సుదీర్ఘ వివరణే ఇచ్చారు.ఇంకోవైపు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కూడా తన తాత లచ్చన్న కార్యక్రమం అని తాను వెళ్ళానని అంతే తప్ప అక్కడ ఎవరు వచ్చారో చూడలేదని అన్నారు. మొత్తానికి జోగి రమేష్ అక్కడ ఎంట్రీతో టీడీపీ పెద్దలు అయితే అగ్గి మీద గుగ్గిలమే అవుతున్నారు.దీనికి అంతటికీ కారణం ఏంటి అంటే వైసీపీ ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్నపుడు జోగి రమేష్ టీడీపీ వారి మీద అనుచిత వ్యాఖ్యలు చేశారు. అంతే కాదు ఆయన ఏకంగా చంద్రబాబు లోకేష్ మీద కూడా తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. వాటిని తమ్ముళ్ళు అయితే మరచిపోలేదని అంటున్నారు.అంతే కాకుండా చంద్రబాబు ఇంటి మీదకు దాడికి రమేష్ వెళ్లారు అన్నది అప్పట్లో సంచలనమైంది. తాను బాబుకు వినతిపత్రం ఇవ్వాలని మాత్రమే ఆయన ఇంటికి వెళ్లాను అని జోగి రమేష్ ఆ తరువాత చెప్పినా ఆయన మందీ మార్బలంతో వెళ్లడంతో పాటు అక్కడ ఆయన అనుచరులు చేసిన రచ్చ చూసిన టీడీపీ అయితే అది దాడి అనే నిర్ధారించింది.ఇవన్నీ పక్కన ఉంచితే అగ్రి గోల్డ్ ఇష్యూలో జోగి రమేష్ కుమారుడిని కూటమి ప్రభుత్వం వచ్చాక అరెస్ట్ చేశారు. అది కూడా ఆయనకు ఇబ్బందిగా మారింది. దాంతో పాటు బాబు ఇంటి మీద దాడి కేసు ఉంది. ఇలా ఉక్కిరిబిక్కిరి అవుతున్న దశలో ఆయన టీడీపీలో చేరాలని చూస్తున్నారు అని ప్రచారంలో ఉంది.దానికి తగినట్లుగానే ఆయన అక్కడ కనిపించారు అని కూడా అంటున్నారు. అయితే జోగి రమేష్ సడెన్ గా టీడీపీ వారితో కనిపించడంతో పార్టీ హైకమాండ్ అయితే ఫైర్ అయినట్లుగానే ఉంది అని చెబుతున్నారు. ఇవన్నీ జోగిని పార్టీలోకి తీసుకునే సీన్ లేదని చెప్పేందుకే అని అంటున్నారు.టీడీపీ అనేక మంది వైసీపీ నేతలను చేర్చుకుంటోంది. అయితే వారంతా వ్యక్తిగతంగా టీడీపీ నేతలను అధినేతలను పెద్దగా విమర్శించిన దాఖలాలు లేవన్న ట్రాక్ రికార్డు చూసి మరీ చాన్స్ ఇస్తోంది. మరీ ముఖ్యంగా చంద్రబాబు లోకేష్ ల మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన వారికి అయితే పసుపు పార్టీలో చోటే లేదని కూడా స్పష్టం చేస్తోంది.రాజకీయంగా రెండు దశాబ్దాలుగా కీలకంగా ఉంటూ వచ్చిన మాజీ మంత్రి జోగి రమేష్ కి ఇవన్నీ తెలియవా అన్నది కూడా చర్చగా ఉంది. అయితే రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చు అనుకునే వారికి అక్కడ ఉన్నది లోకేష్ అన్నది కూడా గమనించాలని అంటున్నారు. మొత్తానికి జోగితో రాసుకుంటే సీన్ సితారే అన్న గట్టి హెచ్చరికను అయితే టీడీపీ హైకమాండ్ పంపింది అని అంటున్నారు.

## షిప్‌లో 1320 టన్నుల పీడీఎస్ బియ్యం

కాకినాడ,కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంపై కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ కీలక ప్రకటన చేశారు. స్టెల్లా నౌకలో 1320 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. గత 29న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టును పరిశీలించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అధికారులతో పీడీఎస్ బియ్యం ఉన్న స్టెల్లా నౌక పరిశీలించారు. ఈ వ్యవహారం సంచలనం అవ్వడంతో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. కాకినాడ పోర్టు రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కలెక్టర్ షాన్ మోహన్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. గత నెలలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్టెల్లా నౌకను పరిశీలించిన అనంతరం 5 విభాగాల అధికారులు బృందం ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందం 12 గంటల పాటు స్టెల్లా షిప్‌లోని 5 కంపార్ట్‌మెంట్లలో తనిఖీలు నిర్వహించింది. మొత్తం 12శాంపిల్స్ సేకరించారు. ఈ షిప్‌లో దాదాపు 4 వేల టన్నుల బియ్యం రవాణా అవుతున్నాయన్నారు. వీటిలో 1,320 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్టు నిర్ధరించామన్నారు. సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ బియ్యం ఎగుమతి చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. వాళ్లు ఎక్కడి నుంచి బియ్యం తీసుకొచ్చారు, ఎక్కడ నిల్వ చేశారు అనే దానిపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందన్నారు. కాకినాడ పోర్టులోని స్టెల్లా నౌకలో 1,320 టన్నుల రేషన్ బియ్యాన్ని అన్‌లోడ్ చేయించి సీజ్ చేస్తామని కలెక్టర్ షాన్ మోహన్ ప్రకటించారు. పోర్టులో ఇంకా 12 వేల టన్నుల బియ్యం లోడ్ చేయాల్సిన ఉందన్నారు. వీటిలో పీడీఎస్ బియ్యం లేవని నిర్ధారించాకే లోడింగ్‌కు అనుమతిస్తామన్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు, డీప్ సీ వాటర్ పోర్టులో కూడా మరో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా నిఘా పెట్టామన్నారు. ఒక్క గ్రాము పీడీఎస్ బియ్యం కూడా దేశం దాటకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు. స్టెల్లా షిప్‌ను ఎప్పుడు విడుదల చేయాలనే దానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

# ప్రతిపక్షాల అభ్యంతరాలేంటి.?




న్యూఢిల్లీ,సువిశాల భారతావనిలో ఎన్నికల నిర్వహణ కత్తిమీద సాములాంటి వ్యవహారం. నిత్యం ఏదో ఓ మూలన ఎన్నికల సందడి కనిపిస్తూనే ఉంటుంది. అయితే.. పార్లమెంట్, అసెంబ్లీ.. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికలు సర్వసాధారణం. ఈ విధానాన్ని పూర్తిగా మార్చేయాలని భావిస్తున్న కేంద్రంలోని బీజేపీ.. జమిలి ఎన్నికలకు సై అంటోంది. ప్రతిపక్ష పార్టీల నుంచి వ్యతిరేకత వస్తున్నా, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదంటోంది. ఎన్డీయే రెండో సారి అధికారంలో ఉన్నప్పటి నుంచి జమిలి చర్చను ప్రజల్లోకి తీసుకురాగా.. సుదీర్ఘ కసరత్తు తర్వాత ఆచరణకు అడుగు దూరంలో నిలిచింది. ఈ నేపథ్యంలోనే అసలు ఇప్పుడు అమలవుతున్న విధానం ఏంటీ.? జమిలికి మారడం వల్ల రానున్న ప్రయోజనాలేంటి.? ప్రతిపక్షాలు, స్థానిక పార్టీల అభ్యంతరాలేంటి.? ఈ కథనంలో తెలుసుకుందాం..భారత రాజ్యాంగం నిర్దేశించిన మేరకు స్థానిక సంస్థల నుంచి దేశ పార్లమెంట్ వరకు పరిపాలనా వ్యవస్థలకు ఎన్నికైన సమయం నుంచి ఐదేళ్ల పాటు అధికారం లభిస్తుంది. ఏదైనా కారణాలతో ఆయా పరిపాలనా వ్యవస్థ అధికారం నుంచి దిగిపోతే, కోల్పోయినా.. మరోమారు ఎన్నికలు నిర్వహించి కొత్త వ్యవస్థను నెలకొల్పాల్సి ఉంటుంది. ఈ బాధ్యతను రాజ్యాంగ వ్యవస్థగా ఉన్న భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తుంటుంది. కేంద్ర, రాష్ట్రాల స్థాయిలో కార్యనిర్వాహక వ్యవస్థల సహకారంలో ఎన్నికల సంఘం ఎన్నికల్ని సజావుగా నడిపిస్తోంది. అయితే.. ఇప్పటి వరకు ఒక తీరు, జమిలి అమలైతే మరో తీరుగా ఎన్నికల ప్రక్రియ ఉండనుంది.

ఇప్పుడు దేశంలో ఎన్నికల తీరేంటి

దేశంలోని వివిధ స్థాయిల్లోని పరిపాలనా వ్యవస్థలకు ఎన్నికలు నిర్వహించి..ఐదేళ్ల పరిపాలనా సమయాన్ని ఇస్తుంటారు. ఈ కాలంలో పూర్తిగా అధికార సమయాన్ని వినియోగించుకుంటే సమస్య లేదు కానీ.. వివిధ బాహ్య, అంతర్గత సమస్యలతో అసెంబ్లీ, పార్లమెంట్లు రద్దయినా.. స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థలు రద్దైనా.. మళ్లీ ఎన్నికలకు వెళతారు. కొత్త సభ కొలువు దీరిన తర్వాత నుంచి మళ్లీ ఐదేళ్ల పాటు అధికారం సంక్రమిస్తుంటుంది. ఈ విధానంతోనే కేంద్రం విభేదిస్తోంది. ఇలా.. విశాల దేశంలో నిత్యం ఎన్నికలు జరిగితే ఎలా అని ప్రశ్నిస్తోంది. అందుకే.. జమిలి ఎన్నికలే బెస్ట్ అంటూ చెబుతోంది.

జమిలితో రానున్న మార్పులు ఏంటి

తొలిదశలో దేశవ్యాప్తంగా పార్లమెంటుకు, అన్ని అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారు. దాంతో.. దేశంలో ఎక్కడా ఎన్నికలు అనే మాట వినిపించదు. ఆ తర్వాత కొన్నాళ్లకు స్థానిక సంస్థలను కూడా ఇందులో భాగం చేయనున్నారు. దాంతో.. స్థానికం నుంచి దేశ స్థాయి వరకు ఒకేసారి ఎన్నికలు పూర్తవుతాయి అన్నది కేంద్రం వాదన. ఒకవేళ ఏ అసెంబ్లీ అయినా మధ్యలోనే రద్దుయితే.. దాని స్థానంలో నిర్వహించే ఎన్నికలు ఇకపై ఐదేళ్ల కాలపరిమితిలో ఉండవు అన్నది కొత్త నిబంధన. మధ్యంతర ఎన్నికల సమయం నుంచి జమిలి ఎన్నికలు ఎప్పటి వరకో.. ఆ అసెంబ్లీ కాలపరిమితి అప్పటి వరకే ఉండనుంది. అంటే.. ఉదాహరణకు %-% ఏదైనా రాష్ట్రానికి జమిలిలో భాగంగా 2025 లో ఎన్నికలు జరిగి సభ కొలువు తీరింది అనుకుందాం. అప్పుడు.. ఆ అసెంబ్లీ గడువు 2030 వరకు ఉంటుంది. కానీ.. రెండేళ్ల తర్వాత అంటే 2027లో ఏవైనా కారణాలతో అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళితే.. కొత్తగా ఏర్పడనున్న అసెంబ్లీ పదవీ కాలం అంతకు ముందులా ఐదేళ్లు ఉండదు. జమిలి నిబంధనల ప్రకారం.. సార్వత్రిక ఎన్నికలు జరిగే 2030 వరకే. అంటే.. ఆ అసెంబ్లీ గడువు కేవలం మూడేళ్లే ఉంటుంది. ఇదీ.. జమిలిలో ఉండే అసలు తిరకాసు.

కేంద్రం చెబుతున్నదేంటి..

రాష్ట్ర స్థాయిలో కానీ, స్థానిక సంస్థలకు కానీ ఎన్నికల జరుగుతుంటే అక్కడ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దాంతో.. అక్కడ అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు కానీ, నూతన పథకాల ప్రారంభం కానీ.. ఆయా ప్రాంత ప్రజల అవసరాలు తీరేలా ఎలాంటి నిధుల విడుదలకు కానీ అవకాశం ఉండదు. ఈ కారణంగానే.. మిగతా ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనుల్ని పక్కన పెట్టేస్తుంటాయి ప్రభుత్వాలు. జమిలి ద్వారా ఈ సమస్యకు చెక్ పెట్టాలనేది కేంద్రం ప్రయత్నం. దాంతో పాటే.. కార్యనిర్వహణలో ఉండాల్సిన సిబ్బందిని నిత్యం వివిధ ఎన్నికల్లో వినియోగించడం వల్ల అసలు ప్రయోజనాలు నెరవేరడం లేదంటున్నారు. పైగా.. పోలీసులు, రిజర్వ్ పోలీసులు సహా మిగతా యంత్రాంగం మొత్తం నిత్యం ఎన్నికల విధుల్లోనే ఉండాల్సి వస్తుందన్నది ప్రధాన వాదన. అలాగే.. పార్లమెంట్ స్థాయి ఎన్నికలకు గస్తీ తిరిగే పోలీసులు, అసెంబ్లీ ఎన్నికలకు మరోసారి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి పని చేయాల్సి ఉంటుంది. అల్లర్ల నియంత్రణకు నిఘా, డబ్బు, ఇతర ప్రలోభాలకు గురిచేయకుండా నిరోధించేందుకు ఒకే ప్రాంతంలో వేరువేరు సార్లు తిరగాల్సి ఉంటుంది. దీని వల్ల నిర్వహణ వ్యయం ప్రభుత్వాలకు మోయలేని భారంగా మారుతుందని అంటున్నారు. అదే.. జమిలి పద్ధతిలో అయితే ఒకే సారి పోలీసు నిఘా, గస్తీ, ఎన్నికల సిబ్బంది సహా.. అనేక విషయాలు కలిసి వస్తాయని చెబుతున్నారు.

ప్రతిపక్షాల అభ్యంతరాలేంటి..

కేంద్రం జమిలి ద్వారా స్థానిక పార్టీలను నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆరోపిస్తున్నారు. ఒకేసారి కేంద్ర, రాష్ట్రాలకు ఎన్నికలు జరిగితే.. జాతీయ ప్రయోజనాలే ఎన్నికల ప్రధానాంశాలుగా మారుతాయి తప్పా.. రాష్ట్రాల అవసరాలు, కోరికలకు చోటు ఉండదనేది ఈ పార్టీల వాదన. ఉదాహరణకు.. జమిలి ఎన్నికల సమయంలో పాకిస్థాన్ వంటి దాయాది దేశంలో గొడవలు జరిగితే.. ఆ అంశం చుట్టూనే ఎన్నికలు జరుగుతాయి తప్పా.. రాష్టాలకు కావాల్సిన అంశాలపై చర్చ జరగదని వాదిస్తున్నారు. అలానే.. సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాలకు ఎన్నికలు జరిగితే.. అన్ని చోట్ల ఓటరు ఒకే పార్టీకి, లేదా కూటమి వైపు మొగ్గుతాడని.. రాష్ట్ర స్థాయిలో రెండో ఎంపికకు వెళ్లడనేది ప్రతిపక్షాలు చెబుతున్న మాట. ఇటీవల.. ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ ఎన్నికలను పరిశీలిస్తే.. స్థానికంగా ఏ పార్టీలకు ప్రజలు మద్ధతు పలికారో, పార్లమెంట్ స్థానానికి అదే పార్టీకి మద్ధతుగా నిలవడాన్ని ఆలోచించాలని చెబుతున్నారు. దీన్ని బట్టి.. ప్రాంతీయ పార్టీల ప్రాణం తీయడంతో పాటు కేంద్రీకృత పాలనా విధానం వైపు దేశాన్ని మళ్లించేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు.ప్రస్తుత విధానంలో విడివిడిగా ఎన్నికలు నిర్వహించేందుకే.. ఎన్నికల సిబ్బంది, ఈవీఎం లు సరిపోని సందర్భంలో ఒకేసారి ఎన్నికలు ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నాయి. పైగా.. ఈ స్థాయిలో ఈవీఎం ల నిల్వలు, రక్షణ బాధ్యతలు ఏంటని అంటున్నారు. విభిన్న పరిస్థితులుండే దేశంలో%ొ% ఏదైనా ఓ ప్రాంతంలో అల్లర్లు చెలరేగితే ఎలా కట్టడి చేస్తారని.. దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఉండే బలగాలను అప్పటికప్పుడు తరలింపు ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.


# ఐదో ఆర్థికశక్తిగా ఎదిగిన భారత్




న్యూఢిల్లీ,మనల్ని పాలించిన బ్రిటన్‌ను అధిగమించి భారత్ ప్రస్తుతం ఐదో ఆర్థికశక్తిగా అవతరించిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గుర్తు చేశారు. కాంగ్రెస్ 55 ఏళ్ల పాలనలో 77 సార్లు రాజ్యాంగ సవరణ జరిగిందన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచేశారని ఆరోపించారు. రాజ్యసభలో రాజ్యాంగంపై జరిగిన చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం మరింత బలం చేకూర్చిందని అన్నారు. నియంతృత్వ అహంకారంతో విర్రవీగిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. కళ్లద్దాలు పరాయి దేశానివైతే.. భారతీయత ఎప్పటికీ కనిపించదంటూ రాహుల్ గాంధీకి చురకలు అంటించారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్య్రపు హక్కును కాలరాసేందుకు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో రాజ్యాంగ సవరణ చేశారని మండిపడ్డారు. భారత్ ఎప్పటికీ స్వతంత్ర ఆర్థిక శక్తిగా ఎదగలేదంటూ చెప్పిన హస్తం పార్టీకి దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అమిత్‌షా అన్నారు.దేశాన్ని ఏకం చేసేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రశంసించారు. ఆయన వల్లే దేశం ఇవాళ ఐక్యంగా ఉందన్నారు. అప్పట్లో ఆయన చేసిన కృషి వల్లే భారత్ మహోన్నత దేశంగా ఆవిర్భవించిందన్నారు. ఒక్క రక్తపు బొట్టు కూడా చిందించకుండా బ్రిటిష్ వారి నుంచి అధికార మార్పిడి జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష కాంగ్రెస్‌పై అమిత్ షా విమర్శలతో విరుచుకుపడ్డారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేయలేదని, మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే వారికి అపన్నహస్తం అందించారని అమిత్ షా పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ముస్లిం మహిళల హక్కులను ఏళ్ల తరబడి కాలరాశారని విమర్శించారు. ప్రజల అభిమానాన్ని పొందలేక..ఎన్నికల్లో ఓడిపోయి.. ఈవీఎంలను తప్పుబట్టడం సిగ్గుచేటన్నారు. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటమికి కారణం ఈవీఎంలే అని చెప్పిన కాంగ్రెస్.. ఝార్ఖండ్ గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

# సైబర్ నేరాలు అరికట్టేందుకు కీలక ప్రాజెక్టు ప్రారంభించిన పోలీసులు

సైబర్ నేరాలను నివారించేందుకు సైబరాబాద్ పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. (ప్రొటెక్ట్) అనే పేరుతో సరికొత్త ప్రాజెక్టును తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్టును సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, మాదాపూర్ డీసీపీ వినీత్‌లు మంగళవారం ప్రారంభించారు.రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. సైబర్ కేటుగాళ్ల చాలామంది వేలు, లక్షలు, కోట్లాది రూపాయలు కూడా పోగొట్టుకుంటున్నారు. అయితే సైబర్ నేరాలను నివారించేందుకు సైబరాబాద్ పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. (ప్రొటెక్ట్) అనే పేరుతో సరికొత్త ప్రాజెక్టును తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్టును సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, మాదాపూర్ డీసీపీ వినీత్‌లు మంగళవారం ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో నెటిజన్లకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, ప్రమాదాలు నివారించే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు పనిచేయనుంది. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడారు. " రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. నేరం జరిగాక నేరస్థులను పట్టుకోవడం కన్నా అసలు ఇలాంటి సైబర్ నేరాలే జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యత అందిరిపై ఉంది.



సైబరాబాద్ పరిధిలో ఈ ఏడాది బాధితులు దాదాపు రూ.700 కోట్లు పోగొట్టుకున్నారు. మనకు తెలియకుండానే మన బ్యాంకులో డబ్బులు పోతున్నాయి. 1930కి కాల్ చేస్తే సైబర్ నేరగాళ్ల నుంచి పోలీసులు కాపాడతారు. సోషల్ మీడియా ద్వారా కూడా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com